



# విజయభాను





విశాఖపట్నం, గురువారం 02-08-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 305 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# రాష్ట్ర ప్రయోజనాలే నాకు ముఖ్యం



**కేంద్ర పెద్దలు సహకరించడం లేదు**

**పేరూరు ప్రాజెక్టు పరిశీలన**

**బిందు, తుంపర సేద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి**

**అనంతపురం పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

అనంతపురం: రాష్ట్ర ప్రయోజనాల కోసం కొన్ని సందర్భాల్లో నేను తగ్గా. కేంద్రంలో పెద్దలు సరిగా స్పందించకపోయినా.. ఏ మాత్రం పలకరించకపోయినా.. అనేక ప్రయత్నాలు చేశాం. పోరాటం అనేది వస్తే ఎవరైనా నా తర్వాతే. అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు.

అనంతపురం జిల్లా రామగిరి మండలం పేరూరులో సీఎం పర్యటించారు. పేరూరు ప్రాజెక్టుకు నీరు తరలించే కాల్వకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. అనంతపురం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకున్నా. జిల్లాకు కేంద్రీయ విశ్వ విద్యాలయం వచ్చి తీరుతుంది. జిల్లాలో లక్షా ఏడు వేల ఇళ్లు ఇచ్చాం. పేరూరు ప్రాజెక్టుకు నీరు తరలించే కాల్వకు పరిటాల రవీంద్ర కాల్వగా పేరు పెడతాం. నీటిని సమర్థంగా వినియోగించుకోవాలి. బిందు, తుంపర సేద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి తరువాయి 2లో..

## బాబు మోసాలు బయటపడుతున్నాయి

**రిజర్వేషన్లపై హామీలు ఏమయ్యాయి? -- సీఎంకు లేఖ రాసిన కన్నా లక్ష్మీనారాయణ**



అమరావతి: ఎన్నికల సమయంలో వివిధ కులాల వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని, రిజర్వేషన్ల స్థాయి పెంచుతామని హామీ ఇచ్చి చంద్రబాబు మోసం చేశారని భాజాపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలపై ముఖ్యమంత్రికి వరుసగా లేఖలు రాస్తున్న ఆయన బుధవారం తన ఐదో లేఖను సంధించారు. కాపులను బీసీల్లో చేరుస్తామని, రజకులను ఎస్సీల్లో చేరుస్తామని, వాల్మీకులను ఎస్టీ కేటగిరీలో చేరుస్తామని ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడంలేదని నిలదీశారు.

విజయనగరం జిల్లా బలిఘట్టం గ్రామంలో జరిగిన 500 కోట్ల రూపాయల భూకుంభకోణంలో సీబీఐ విచారణకు సిద్ధమా? అని ముఖ్యమంత్రిని కన్నా ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి దోచుకున్న లక్ష కోట్లను అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు పంచుతామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. హెరిటేజ్ సంస్థ కోసం చిత్తూరు డైరీని దివాలా తీయించారని లేఖలో ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలాంటి పనులు చేయవచ్చా అని ప్రశ్నిం తరువాయి 2లో..

పోషకాహార లోపం లేకుండుటకు, డ్రాపౌట్స్ తగ్గుదలకు

# మధ్యాహ్న భోజన పథకం

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు జూ. కళాశాల విద్యార్థులకూ అమలు
- ప్రాజెక్టు వ్యయం రూ. 56.53 కోట్లు .. తొలి విడతగా రూ. 23 కోట్లు విడుదల
- ప్రతీ ఏడాది రూ. 25 వేల కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తోంది
- విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు



*మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న విద్యాశాఖామాత్యులు గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్*

విశాఖపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించేందుకు, వారిలో పోషకాహార లోపం లేకుండా చూసేందుకు, ఫలితాలు మెరుగుపరచడానికి అమలు చేస్తున్న ఈ పథకం వల్ల అన్ని ప్రభుత్వ స్కూళ్లలో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. దీనిని త్వరలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఉన్న ఇంటర్మీడియట్ విద్యార్థులకూ దీనిని అమలు చేయనున్నట్లు రాష్ట్ర తరువాయి 2లో..

## విశాఖ రైల్వేజోన్‌కు పచ్చజెండా!



అమరావతి: కడప ఉక్కు పరిశ్రమ, విశాఖ రైల్వేజోన్ రాకుండా అడ్డుకునేది తెలుగుదేశం ప్రభుత్వమేనని భాజపా ఆరోపించింది. భాజాపా కోర్ కమిటీ మీటింగ్‌లో తరువాయి 2లో..

## తాణాంలో బిసి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి ప్రారంభం

**ముఖ్య అతిథిగా మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు హాజరు**



పరవాడ: పరవాడ మండలము తాణాం గ్రామంలో బుదవారము బిసి రెసిడన్సియల్ జూనియర్ కాలేజిని బుధవారము రాష్ట మంత్రివర్యులు కింజరపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హజరై అతని చేతులు మీదగా ప్రారంబించారు. స్దానిక శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి అద్యక్షత జరిగన ఈ సభలో మంత్రి మాట్లాడుతూ రెండు జూనియర్ కాలేజిలో ఉంటే కొత్తగా పన్నెండు జూనియర్ మంజూరు అవ్వడము అ పన్నెండు జూనియర్ కాలేజీలో బుధవారమే ప్రారంభం అవ్వడము ఎంతో శుభోధయంగా ఉందని ఈ సందర్భంగ అయన అన్నారు.

ఈ సభలో జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాధరావు, ఎంపిపి మాసవరపు అప్పలనాయుఢు, ఎఫ్ సిఐ మెంబర్ పైల సన్యాశిరాజు, సర్పంచ్ పైలపద్మ, పెందుర్తి నియోజకవర్గ ఇన్ చార్జి బండారు అప్పలనాయుడు, మరియు నియోజకవర్గంలో గల సర్పంచ్ ,ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## బోరుబావిలో పడిన చిన్నారికి సహాయక చర్యలు

పట్నా: బిహార్‌లోని ముంగర్ జిల్లాలో ఓ మూడేళ్ల చిన్నారి ప్రమాదవశాత్తు బోరుబావిలో పడిపోయింది. మంగళవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. సదరు చిన్నారి ఇంటి వద్ద ఆడుకుంటుండగా బోరుబావి కోసం వేసిన గుంతలో ప్రమాదవశాత్తు పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు పరుగుపరుగున వచ్చి చూసేసరికి అప్పటికే చిన్నారి చాలా లోతుకు వెళ్లిపోయింది. దీంతో వెంటనే వారు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. అప్రమత్తమైన పోలీసులు, రెస్క్యూ

# వ్యక్తిగత విమర్శలకు దిగొద్దు

**ఆరోపణలు నిరూపించాలి .. ఇది పెట్టుబడులపై ప్రభావం చూపుతుంది**

**10 ఐటీ కంపెనీలు ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్**



అమరావతిః కాపు రిజర్వేషన్ల గురించి ప్రతిపక్ష నేత జగన్ ఎప్పుడెప్పుడు ఏమేం చెప్పారో అందరికీ తెలుసని మంత్రి నారా లోకేశ్ అన్నారు.

అందుకే అనుభవం ఉన్న వ్యక్తి తమ నేతగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జనసేన అధినేత పవన్ తనపై అదే పనిగా ఎందుకు విమర్శలు చేస్తున్నారో అర్థం కావడం లేదన్న లోకేశ్.... తాను అవినీతిపరుడినే అయితే ఇన్ని ఐటీ కంపెనీలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. తనపై చేసిన ఆరోపణలు పవన్ ఎందుకు నిరూపించలేకపోతున్నారని నిలదీశారు.

తనకు పరిచయం లేని శేఖర్‌రెడ్డితో సంబంధాలు అంటగట్టడం సరికాదని హితవు పలికారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే పవన్ ఎలా బాధ పడతారో తానూ అలాగే బాధపడుతున్నానని అన్నారు.

కేంద్రం బుల్లెట్ రైలు కోసం భూమిని సేకరించలేకపోతోందన్న లోకేశ్.. రాజధాని కోసం 33 వేల ఎకరాల భూమిని రైతులు ఉదారంగా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పవన్ అర్థంలేని ఆరోపణలు చేయడం వల్ల ప్రతిష్టాత్మక కంపెనీలు పెట్టుబడులకు వెనకాడుతున్నాయని అన్నారు.

పవన్‌కళ్యాణ్ కూడా కొన్ని కంపెనీలను రాష్ట్రానికి తెస్తే.. వారికీ ఇప్పుడు ఇస్తున్న విధానంలోనే ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. ఆధారాల్లేని ఆరోపణలు చేయడం వలన కంపెనీలు వెనక్కి వెళ్లిపోతాయన్న విషయాన్ని పవన్ గ్రహించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసినందున ప్రత్యేక అధికారుల పాలనకు నిర్ణయం తీసుకున్నామని తరువాయి 2లో..




## ఎస్సీ, ఎస్టీ చట్టంపై కేంద్ర మంత్రివర్గం సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఇటీవల ఎస్సీ, ఎస్టీ చట్టంపై ఇచ్చిన తీర్పు నేపథ్యంలో బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం సంచలన నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ చట్టంలో ఎటువంటి మార్పులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ బిల్లును ఈ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది.

కేంద్ర మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ, ఇతర దళిత సంఘాలు చేస్తున్న డిమాండ్లతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చింది.

## చిదంబరానికి ఉపశమనం

న్యూదిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా కేసుకు సంబంధించి కేంద్ర మాజీ మంత్రి చిదంబరానికి ఊరట లభించింది. సెప్టెంబర్ 28 వరకూ ఆయన్ను అరెస్ట్ చేయకుండా దిల్లీ హైకోర్టు మరోసారి తాత్కాలిక ఉపశమనం కలిగించింది. ముందస్తు బెయిలు కోసం ఆయన చేసిన అభ్యర్థన పరిశీలించిన అనంతరం కోర్టు ఈ వెసులుబాటు కలిపించింది.

ఈ అభ్యర్థనను పరిశీలించిన న్యాయమూర్తి ఏకే పాఠక్ దీనిపై నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఈడీని ఆదేశించారు. ఇప్పటికే తాము సమాధానం ఇచ్చామని విచారణ సమయంలో సీబీఐ తరపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. తరువాయి 2లో..



# అవరోధాలు అధిగమించి నిర్దేశించిన లక్ష్యాలు సాధించండి

**- కమిషనర్ హరినారాయణన్**




విశాఖపట్నం :- అమృత్ 1 మరియు 2 దశలలో నిర్వహించవలసిన త్రాగునీటి పైపుల అమరిక, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో ఏర్పాటు చేయవలసిన పైపులైన్లను అవరోధాలు అధిగమించి నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో ఇంజనీర్లు, ఎన్.సి.సి సంస్థ ప్రతినిధులు, కాంట్రాక్టర్లతో బుధవారం పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా సర్వీస్ ఇంప్రువ్‌మెంట్ ప్లాన్ కార్యాచరణ ఖరారు చేసి అమలు చేయాలని ఆదేశించారు. 24x 7 వాటర్ సప్లయి పైపులైన్లు, కనెక్షన్లను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలని పేర్కొన్నారు. అమృత్ ఫేజ్ 1 మరియు 2 క్రింద పైపులను సకాలంలో నిర్దేశించిన విధంగా బిగించాలని కోరారు. వీలైనంత త్వరగా త్రాగునీటి కోళాయిలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమస్యలేమైనా ఉంటే తనదృష్టికి తీసుకురావాలని కోరారు. పనులను వేగవంతం చేయడానికి మెన్, మెటీరియల్ ను రెట్టింపు చేయాలని ఎన్.సి.సి సంస్థ ప్రతినిధులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. రోజుకు 800 కోళాయి కనెక్షన్లు అమరిక లక్ష్యంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా 306 కి.మీ పైపులైను వేయాల్సిఉండగా 104 కి.మీ పైపులైను పూర్తి చేశారు.

సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఎన్.దుర్గాప్రసాద్, అదనపు కమిషనర్ (ప్రాజెక్టులు) టి.సకలారెడ్డి, యస్.ఇ వెంకటేశ్వరరావు, పల్లంరాజు, ఇ.ఇ రాంమోహన్, ఏడుకొండలు ఎన్.సి.సి సంస్థ ప్రతినిధులు బాబు, రాజు, అవినాష్ కుమార్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నవంబరులో విశాఖలో అంతర్జాతీయ విద్య సదస్సు

**- యునెస్కో, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 15-17 వరకు**

**- యునెస్కో చీఫ్ ఎడ్వైజర్, రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్, జాయింట్ కలెక్టర్ చర్చ**



విశాఖపట్నం : అంతర్జాతీయ స్థాయిలో అమలుపరుస్తున్న అధునాతన విద్యా విధానాలను రాష్ట్రంలో అమల్లోకి తెచ్చి రాష్ట్రాన్ని విద్య, విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ దిశలో యునెస్కో, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో గత ఏగాది డిసెంబర్ 16 నుండి 18వరకు విశాఖనగరంలో అంతర్జాతీయ విద్య సదస్సును నిర్వహించి, అందులో గుర్తించిన కొన్ని అధునాతన విద్యావిధానాలను రాష్ట్రంలోకి అమల్లోకి తెచ్చారు.

అదేతరహాలో తిరిగి ఈ ఏడాది కూడా విశాఖలోనే ఈ సదస్సును నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. ఈ ఏడాది నవంబర్ 15నుండి 17 వరకు విశాఖలో నిర్వహిం చేందుకు సన్నాహాలు చేస్తుంది. ఇందులో భాగంగా యునెస్కో ఈఫ్ ఎడ్వైజర్ కెయిన్, రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ సుజాతశర్మ, జాయింట్ కలెక్టర్ జి.సృజన, పలు ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశమై నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సదస్సు హోటల్ నొవొటెల్‌లో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు యునెస్కో చీఫ్ ఎడ్వైజర్ కెయిన్ తెలిపారు. సదస్సుకు హాజరయ్యే వారు తమ పేరును నమోదు చేసుకునేందుకు సెప్టెంబర్ 15వతేదీ తుది గడువు పెట్టినట్లు తెలిపారు.

కళాశాల విద్య కమిషనర్ సుజాతశర్మ మాట్లాడుతూ ఈ సదస్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు కేంద్ర, రాష్ట్రాలకు చెందిన పలువురు మంత్రులు హాజరవుతున్నారన్నారు. ఈ ఏడాది ఈ సదస్సు మరింత విజయవంతం అయ్యేందుకు ఏర్పాట్లు చేయాలని ఆమె కోరారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సి.చంద్రశేఖర్‌రెడ్డి, తేజ్ భరత్, డా.వి.చంద్రశేఖర్, డా.శోభారాణి, ఐ.విజయవాబు తదితరులతో పాటు విద్య, రెవెన్యూశాఖల అధికారులు పాల్గొన్నారు.

## చెరకు మొక్క తోటలకు చెవులపిల్లల బెడద

రావికమతం : మండలంలోని చెరకు రైతులు చెవుల పిల్లలతో ఇబ్బంది పెడుతున్నారు. మొన్నటి వరకు ఎలుగుబంట్లు, కోతలు, అడవి పందులతో సతమతమైన వారికి ప్రస్తుతం చెవుల పిల్లల బెడద మొదలైంది. ఇవి నాటిన ఉడుపు మొక్క తోటలను కొరికి వేస్తూ రాత్రి వేళ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అడవిపందులు బెడదతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

## మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో

# ముమ్మరంగా వాహన తనిఖీలు



విజయనగరం : మావోయిస్టుల వారోత్సవాలలో భాగంగా అప్రమత్తమైన విజయనగరం జిల్లా పోలీసుశాఖ జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టినట్లుగా ఒఎస్‌డి శ్రీ విక్రాంత్ పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ జి. పాలరాజు ఆదేశాలతో ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు పోలీసు స్టేషనులలో భద్రతను కట్టుదిట్టం చేసారు. అంతేకాకుండా, ప్రత్యేక పోలీసులు, సాయుధ పోలీసులు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటూ, వాహన తనిఖీలు చేపట్టారు. ఒరిస్సా రాష్ట్రం నుండి వచ్చి, పోయే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి, ఆయా వాహనాలలో ప్రయాణించే అనుమానితుల గురించి, రవాణా అవుతున్న వస్తువుల గురించి, ఆయా వాహనాల పత్రాలు ఆరా తీసారు. ఈ వాహనాల తనిఖీలను పాచిపెంట మండలం పి. కోనవలస, పార్వతీపురం మండలం వెంకంపేట జంక్షన్, కొమరాడ, రామభద్రపురం జంక్షన్ వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ వాహన తనిఖీలును పోలీసు సిబ్బంది ఆయుధాలతో చేపట్టడం, పోలీసు సిబ్బంది ఎక్కువ సంఖ్యలో ఈ వాహన తనిఖీలు చేపట్టడం సర్వత్రా ఉత్కంట నెలకొంది. ఈ వాహన తనిఖీలు సాధారణమైనవే నని, భద్రతా చర్యలలో భాగంగా ఈ వాహన తనిఖీలు చేపట్టామని ఒఎస్‌డి శ్రీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

## రైతుల అభిష్టం మేరకే

# తాండవ నీరు విడుదల



**మాట్లాడుతున్న తాండవ జలాశయ చైర్మన్ కొండబాబు**

నాతవరం : రైతుల అభిష్టం మేరకే తాండవ నీరు విడుదల చేస్తామని తాండవ జలాశయ చైర్మన్ పారుపల్లి కొండబాబు, తాండవ జలాశయ డిఇ రాజేంద్రకుమార్ అన్నారు. బుధవారం తాండవ శిక్షణా కేంద్రంలో జలాశయ పరిధిలోని రైతులు, నీటి సంఘం అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండబాబు మాట్లాడుతూ అందరి అభిష్టం మేరకు నిర్ణయం తీసుకొని మంత్రి అయ్యన్న దృష్టికి తీసుకువెళతామన్నారు. డిఇ మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే సుమారు ఆరు అడుగుల నీటిమట్టం ఉందని, ఇప్పుడున్న నీరు విడుదల చేస్తే 90 రోజుల మేర సరిపోతుందన్నారు. కాగా ఈ సమావేశంలో 10, 11 తేదీల్లో నీరు విడుదల చేస్తే మంచిందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శింగపల్లి సన్యాసిదేముడు, జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, తాండవ జెఇ రవికుమార్, నాతవరం ఎఇ వినయ్‌కుమార్, రైతులు, నీటి సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

# పశువుల సమీకృత దాణా పంపిణీ

నర్సీపట్నం : నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామంలో నర్సీపట్నం పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు సమీకృత దానా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి సుకల రమణమ్మ హాజరై ఆమె చేతుల మీదగా దానా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కిలో దానపేపర్ రూపాయలకే ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తుందన్నారు. అన్ని వర్గాల పాడి రైతులు ఈ పథకం ఉపయోగించుకొని మంచి పాల దిగుబడిని సాధించవచ్చన్నారు. నర్సీపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ గణేష్ మాట్లాడుతూ సమీకృత వలన పాల ఉత్పత్తి ఖర్చు బాగా తగ్గుతుందని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

## పోషకాహార లోపం లేకుండుటకు, డ్రాపౌట్స్ తగ్గుదలకు మధ్యాహ్న భోజన పథకం



మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం విశాఖనగరం నడిబొడ్డున గల ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో మంత్రి మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని అన్నారు. దీనిలో భాగంగా పిల్లల డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించేందుకు, మంతి ఫలితాల సాధనకు కృషి చేసేందుకు దీనిని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వానికి జూనియర్ కళాశాలలకైతే రూ. 56.53 కోట్లు ఖర్చవుతోందని తెలిపారు. అందులో తొలి విడతగా రూ. 23 కోట్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర విభజన ఫలితంగా రూ. 16 వేల కోట్ల లోటు బడ్జెట్‌ను ఎదుర్కొంటున్నప్పటికీ టీడీపీ ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తోందని అన్నారు. ప్రభుత్వ కళాశాలలకు దీటుగా అన్ని కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అన్ని ప్రైవేట్ కళాశాలలోనూ ప్రవాస భారతీయుల సహకారంతో డిజిటల్ క్లాసు రూములు, వర్చువల్ క్లాస్ రూములను ఏర్పాటు చేయడం జరుగుతున్నదన్నారు.

రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కమిషనర్ బి. ఉదయ లక్ష్మి మాట్లాడుతూ ఈ మధ్యాహ్న భోజన పథకం అన్ని ప్రభుత్వ పాఠశాలలలోను మంచి ఫలితాలనిస్తోందన్నారు. విద్యార్థులకు మంచి పాఠ్యాంశాలు నేరేందుకు అర్థమయ్యేలా డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. ఇందువల్ల కళాశాలలో విద్యార్థుల సీట్లను పెంచడం తద్వారా మౌలిక వసతుల ఏర్పాట్లు కల్పించడం జరుగుతోందన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన అనంతరం విద్యార్థినులతో కలిసి మంత్రి గంటా శ్రీనివాసరావు, శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఉదయలక్ష్మి తదితరులు భోజనం చేశారు.

జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి డా. ఎం.వి.ఎన్. పాత్రుడు, జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వర రెడ్డి, బి.సి. వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ టి. రాధ తదితరులతోపాటు కళాశాల విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రయోజనాలే నాకు ముఖ్యం

అని రైతులకు పిలుపునిచ్చారు.

అందుకే ధర్మపోరాటం..

నాకు పరిపక్వత లేదని ప్రధాని విమర్శిస్తున్నారు. మేము వైకాపా ట్రాప్‌లో పడ్డామని ప్రధాని అంటున్నారు. వైకాపా ట్రాప్‌లో పడింది మేం కాదు.. భాజపానే. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్డీయేలో చేరాం. అలాంటి పార్టీ మోసం చేసింది. భాజపా నమ్మక ద్రోహంపై ధర్మపోరాట దీక్ష చేస్తున్నా. ప్రజల మనోభావాలను దెబ్బతీయడానికి కుట్ర రాజకీయాలు చేస్తే సహించేది లేదు. పోరాటం అనేది వస్తే ఎవరైనా నా తర్వాతే. రాష్ట్ర ప్రయోజనాల కోసం అనేక ప్రయత్నాలు చేశాం. భాజపా కుట్రలు గుర్తించిన వెంటనే ఎన్డీయే నుంచి బయటకు వచ్చాం. అని చంద్రబాబు అన్నారు.

కొందరు దిల్లీకి ఊడిగం చేస్తున్నారని.. మీరు వారికి నాలుగు ఓట్లు వేస్తే కేసుల మాఫీ కోసమే వినియోగిస్తారని పరోక్షంగా జగన్‌నుద్దేశించి విమర్శించారు. 50 శాతం దాటితే కాపు రిజర్వేషన్లు సాధ్యం కాదని జగన్ అన్నారని.. అందరూ వ్యతిరేకించడంతో తోక ముడిచారని ఎద్దేవా చేశారు.

## బాబు మోసాలు బయటపడుతున్నాయి

చారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శేఖర్‌రెడ్డికి, లోకేశ్‌కు మధ్య సంబంధాలు ఉన్నాయని కన్నా ఆరోపించారు. శేఖర్‌రెడ్డి వ్యవహారాలు, లోకేశ్‌తో సంబంధాలపై సీబీఐ విచారణకూ సిద్ధమా? అని సవాల్ చేశారు. కన్నా లక్ష్మీనారాయణ ఇప్పటివరకూ ఐదు లేఖల ద్వారా 25 ప్రశ్నలను ముఖ్యమంత్రికి సంధించారు.

## వ్యక్తిగత విమర్శలకు దిగొద్దు

లోకేశ్ వెల్లడించారు.

10 ఐటీ కంపెనీలు ప్రారంభం

దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో కంపెనీలకు, పరిశ్రమలకు రాయితీ కల్పిస్తున్నామన్నారు మంత్రి నారా లోకేష్. అమరావతిలో 10 ఐటీ కంపెనీలను ప్రారంభించిన మంత్రి.. ఆ కంపెనీల సీఈవోలతో సమావేశమయ్యారు. కొత్తగా ప్రారంభమైన కంపెనీల్లో అక్రుక్స్ ఐటీ డాటా సర్వీసెస్ , నార్మ్ సాఫ్ట్‌వేర్ ,యలమంచిలి సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ ,కేడ్‌ప్లయ్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, విభర్‌టెక్ సొల్యూషన్స్, హెడ్‌రమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మెంటిస్ ఐటీ సొల్యూషన్స్, ఫ్రీమాంట్ ఐటీ సొల్యూషన్స్, ప్రాకొమ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఉన్నాయి. ఐటీలో లక్ష ఉద్యోగాలు, ఎలక్ట్రానిక్స్‌లో 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఇప్పటి వరకు ఐటీలో 36వేలు.. ఎలక్ట్రానిక్స్‌లో 20వేల ఉద్యోగాలను కల్పించాం. రాబోయే రోజుల్లో విశాఖ, చిత్తూరు, గోదావరి జిల్లాల్లో ఐటీని విస్తరిస్తాం. రాష్ట్రంలో పెట్టుబడులకు ఎన్నో కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. రాష్ట్రంలో ఐదు సైబరాబాద్‌లు నిర్మించాలనే విజన్‌తో పనిచేస్తున్నాం. కొత్త కంపెనీల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం తరపు నుంచి అన్ని అనుమతులు, వసతులు కల్పిస్తున్నాం. ఏపీలో పెట్టుబడులకు ముందుకొచ్చిన కంపెనీలకు ధన్యవాదాలుతెలిపారు మంత్రి.

హైదరాబాద్‌లో ఐటీని ప్రమోట్ చేసి చంద్రబాబు ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. ఆయక కృషి వల్ల చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలు కూడా చాలా వచ్చాయి. 80 శాతం ఉద్యోగాలు కల్పించేవి ఇలాంటి కంపెనీలే. పదేళ్లు ఖాళీగా ఉన్న మేథా టవర్స్ ఇప్పుడు ఫుల్ అయ్యింది.. మరో టవర్ నిర్మాణంలో ఉంది. పరిశ్రమలకు అవసరమైన విధంగా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నాం. ఆగస్టు 15నాటికి ఫైబర్ గ్రిడ్ ద్వారా 5లక్షల కనెక్షన్లు ఇస్తాం. డిసెంబర్ నాటికి ప్రతి పంచాయతీకి ఫ్రీ వైఫై కనెక్షన్ అందుబాటులోకి వస్తుందన్నారులోకేష్.

## చిదంబరానికి ఉపశమనం

దీనిపై తదుపరి విచారణను సెప్టెంబర్ 28కు వాయిదా వేసింది. ఐఎన్‌ఎక్స్ మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి కోర్టు మే 31న చిదంబరానికి తాత్కాలిక ఉపశమనాన్ని కల్పించింది. ఆయన్ను అరెస్ట్ చేయొద్దని ఈడీకి సూచించింది. సీబీఐ కేసులో కూడా హైకోర్టు ఆయనకు ఈ ఉపశమాన్ని పొడిగించింది. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసు, ఐఎన్‌ఎక్స్ మీడియా ఒప్పందాల్లో జరిగిన అవకతవకల్లో చిదంబరం పాత్రపై ఈడీ, సీబీఐ దర్యాప్తు చేస్తున్నాయి.

## బోరుబావిలో పడిన చిన్నారికి సహాయక చర్యలు

సిబ్బంది బోరుబావి వద్ద సహాయక చర్యలు చేపట్టారు. బోరుబావి మొత్తం లోతు 110 అడుగులు ఉండగా.. ప్రస్తుతం ఆ చిన్నారి 100 అడుగుల లోతులో చిక్కుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. పాపను బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

పాపను బయటకు తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. చిన్నారికి ఆక్సిజన్ అందిస్తున్నాం. చిన్నారి ఇంకా కిందకు పడిపోకుండా ఉండేలా కింద రాడ్లు ఏర్పాటు చేశాం. మరో 4 లేదా 5 గంటల్లో పాపను క్షేమంగా తీసుకొస్తాం అని అధికారులు చెబుతున్నారు.

## విశాఖ రైల్వేజోన్‌కు పచ్చజెండా!

పాల్గొనేందుకు గన్నవరం చేరకున్న భాజాపా శాసనసభాపక్షనేత విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ మాధవ్ మీడియాతో ముచ్చటించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక నిధులు ఇస్తామని కేంద్రం చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ప్రారంభించకుండా తాత్సారం చేస్తోందని శాసనసభాపక్ష నేత విష్ణు కుమారరాజు అన్నారు. కడప ఉక్కు పరిశ్రమ, విశాఖ రైల్వే జోను రాకుండా అడ్డుకునేది తెలుగుదేశమేనని ఆరోపించారు. నాలుగు డివిజన్లు కలిపి విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుందని... దీనిపై కొందరు పనిగట్టుకుని విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

పోలవరం ప్రాజెక్టుకు 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని...రాష్ట్ర ప్రభుత్వం కేవలం పర్యవేక్షణ మాత్రమే చేస్తోందని ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. అయితే ప్రాజెక్టు మొత్తం తామే పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. భాజాపా ప్రభుత్వం ఏపీకి ఇచ్చిన అన్ని హామీలను తప్పకుండా నేరవేస్తుందని మాధవ్ స్పష్టం చేశారు.

# ఘనంగా జాప్ 25వ వార్షికోత్సవం

**- వార్తలు ప్రజాపక్షంగా ఉండాలి**

**- జడ్పీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి**

**- నూతన కార్యవర్గం ఎన్నిక**




విజయనగరం : పత్రికలు, మీడియాలో వచ్చే కథనాలు, వార్తలు ప్రజాపక్షంగా ఉండాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డా.శోభాస్వాతిరాణి ఆకాంక్షించారు. ఏదొక రాజకీయ పార్టీకి అనుకూలంగా మీడియా కథనాలు ఉండకూడదని సూచించారు. స్థానిక ఐఎంఎ హాల్‌లో బుధవరం జాప్ 25వ వార్షికోత్సవ వేడుకలు, నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన స్వాతిరాణి మాట్లాడుతూ జర్నలిస్టులు తమ విధి నిర్వహణలో ప్రాణాలు తెగించి కష్టపడడం అభినందనీయమన్నారు. హుదూద్ సమయంలో విజయనగరంలో చాలా మంది జర్నలిస్టులు పడ్డ తెగువ, ధైర్యం చూసి ఆశ్చర్యం కలిగిందని అన్నారు. అతి తక్కువ వేతనాలకు పని చేస్తూ సయమానికి నిద్రహారాలు లేకుండా శ్రమిస్తున్న జర్నలిస్టు సోదరులను చూసి చాలాసార్లు బాధ కలిగిందన్నారు. రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోల్చుకుంటే విజయనగరం జర్నలిస్టు సోదరులు అనేక విషయాల్లో ఆదర్శవంతులని కొనియాడారు. ఈ నాలుగేళ్ల పాలనలో సహాయ సహకారాలు అందించిన జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. తమప్రభుత్వం కూడా జర్నలిస్టుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. జర్నలిస్టులు ఐక్యంగా కలిసి ఉండడం ద్వారా ఏదైనా సాధించుకోగలరని సూచించారు. జాప్ రాష్ట్ర అధ్యక్షుడు పున్నపు రెడ్డి ప్రధాన కార్యదర్శి యుగంధర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పాత్రికేయ సంఘాలు యాజమాన్యాలతో పోరాడే పరిస్థితి లేదన్నారు. అందుకే జర్నలిస్టు హక్కుల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే దిశగా జాప్ పనిచేస్తోందన్నారు. విపత్కర పరిస్థితుల్లో పనిచేస్తున్న 50 ఏళ్లునిండిన జర్నలిస్టులకు పించన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం పై ఒత్తిడి చేస్తున్నామన్నారు. ఈ దిశగా జాతీయ స్థాయిలో ఎన్‌యుజె కృషి చేస్తోందన్నారు. కర్నాటక ప్రభుత్వం ఉత్తర్వులు కూడా ఇచ్చిందన్నారు.మరోవైపు యాడ్స్ ద్వారా వచ్చే ఆదాయంతో ఐదు శాతం నిధులతో యాజమాన్యాలు తమ సంస్థలో పనిచేసే జర్నలిస్టుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటుచేయాలని జాప్ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హౌసింగ్ పథకానికి నిధులు కేటాయించిన ప్రభుత్వానికి ఈ సందర్భంగాకృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాప్‌నూతన అధ్యక్షుడుగా గొర్లి సూరిబాబు, కార్యదర్శిగా జామి కృష్ణ, గౌరవాధ్యక్షుడిగా సిహెచ్ శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గ సభ్యులను జాప్ రాష్ట్ర అధ్యక్షుడు పున్నపురెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రఉపాధ్యక్షుడు జగ్గిన ఆదినారాయణ, ఎన్‌యుజె(డి)సభ్యుడు సి.హెచ్.జయరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుఎం.మరియాదాసు, అక్షరనిజం ఎడిటర్ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న బీమా పంపిణీ



కంచరపాలెం: బుధవారం స్థానిక 37వ వార్డు పరిధిలో గల సురేష్ రామ్‌నగర్ గ్రామంలో నివసిస్తున్న వడ్డాది మణి అను మహిళ అకస్మాత్తుగా మరణించారు. 37వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మరియు రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావు స్వయంగా వారి ఇంటి వద్దకు వెళ్లి చనిపోయిన వడ్డాది మణి చంద్రన్న బీమా డబ్బులు రూ. 5,000/-( ఐదు వేల రూపాయలు ) వడ్డాది మణి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. మిగిలిన బీమా మొత్తమును త్వరలోనే వారి ఖాతాకి జమ చేసేటట్లు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మేజర్‌పోర్టుల అథారిటీ బిల్లును ఉపసంహరించుకోవాలి

### యునైటెడ్ పోర్టు & డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్

విశాఖపట్నం: వినాశకర మేజర్‌పోర్టుల అథారిటీబిల్లును ఉపసంహరించాలని కోరుతూ విశాఖ పోర్టు ప్రధానకార్యలయం వద్ద ధర్నా జరిగింది.

ఈ ధర్నా నుద్దేశించి యునైటెడ్ పోర్టు & డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వి.ఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మేజర్ పోర్టులను ప్రైవేటీకరించడానికి వీలుగా మేజర్ పోర్టుల అథారిటీ బిల్లు-2016ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఏరోజునైనా బిల్లు చర్చకు వచ్చి ఓటింగ్‌కు రావచ్చన్నారు. పార్లమెంట్ ఆమోదం పొంది చట్టం అయితే మేజర్ పోర్టులను అథారిటీలుగా మారతాయన్నారు. అనంతరం కార్పొరేట్/విదేశీకంపెనీలకు కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు అనుకుంటే అప్పుడు అమ్మేయవచ్చు అన్నారు. ప్రస్తుతం 11 మేజర్ పోర్టుల దగ్గర 14,604 ఎకరాలు ఖాళీ భూములతో సహా మొత్తం 73,306 ఎకరాలు భూములున్నాయన్నారు. (విశాఖపట్నం పోర్టులో 1269 ఎకరాలు ఖాళీ భూమితో సహా 7560 ఎకరాలు మొత్తం భూములున్నాయి.) ఈ విలువైన పోర్టు భూములను, ఆస్తులను కార్పొరేట్లు/విదేశీకంపెనీలకు కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని, అందుకే ఈ కొత్త చట్టం తీసుకొస్తుందన్నారు. పోర్టు నిధులు మరియు కార్మికుల పెన్షన్ ఫండ్ ప్రభుత్వ బ్యాంకుల్లో కాకుండా ప్రయివేటు బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. దీని వల్ల ఈ నిధులు గోల్‌మాల్ అయ్యే ప్రమాదం వుంది. దీనివల్ల కార్మికులకు, ఉద్యోగులకు, పెన్షనర్లకు మరియు మేజర్ పోర్టులకు తీవ్రనష్టం కలుగజేస్తుంది. కీలకమైన పోర్టులు కార్పొరేట్, విదేశీ కంపెనీల చేతుల్లోకి వెళ్ళితే దేశభద్రతకు, ప్రయోజనాలకు హాని కలుగుతుందన్నారు.

వాస్తవాలు ఇలా ఉండగా, ప్రైవేట్‌పోర్టుల నుండి పోటీని తట్టుకునేందుకు మరియు మేజర్ పోర్టులకు మరింత అత్యదిక స్వయం ప్రతిపత్తి కల్పించి బలోపేతం చేయడానికి కొత్త చట్టం తీసుకొస్తున్నట్లు కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరి ప్రకటించడం పూర్తిగా అభూతకల్పన మాత్రమేనని తీవ్రంగా విమర్శించారు. కార్మికులు, మేజర్ పోర్టులు మరియు దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలుగజేసే ఈ బిల్లును రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కార్మికులు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేయాలని విజ్ఞప్తి చేసారు.

విడిఎల్‌బి&డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధానకార్యదర్శి ఎస్.పరశురాం మాట్లాడుతూ కొత్త చట్టం వల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలు కోల్పోవలసి వస్తుందన్నారు. ఇంకా ఈ ధర్నాలో యూనియన్ నాయకులు బి.లక్ష్మణరావు, కె.ఎస్.కుమార్, జె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వరరావు, కె.సత్యనారాయణ మరియు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గ్రంధాలయానికి కె.కె.రాజు వితరణ



కంచరపాలెం: జీవీఎంసీ 35 వార్డు ధర్మానగర్‌లో గల క్రాంతి యువజన ప్రగతి మండలి గ్రంధాలయం నిర్మాణానికి వై.యెస్.ఆర్ సి.పి. విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు రూ.15000లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల విద్యాభివృద్ధికి వైకాపా ఎల్లప్పుడూ ముందుంటుందని, ఈ గ్రంధాలయం పూర్తయితే ఉపయోగకరంగా వుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా 35వ వార్డు అధ్యక్షుడు కటుమూరి సతీష్, ఎస్సీ సెల్ వార్డు అధ్యక్షుడు సిద్దార్ధ రాజు, ధనాల అప్పారావు, యెస్. జ్యోతి శంకర్, సూర్యారావు పాల్గొన్నారు.

## ఐఏఎస్ఇ ప్రిన్సిపాల్‌గా శివ ప్రసాద్

### ఉత్తర్వులు అందజేసిన వీసీ నాగేశ్వర రావు

ఆంధ్రవిశ్వవిద్యాలయం: ఏయూలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఇ) ప్రిన్సిపాల్‌గా ఆచార్య ఆర్.శివ ప్రసాద్ నియమితులయ్యారు. వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు తన కార్యాలయంలో శివ ప్రసాద్‌కు ఉత్తర్వులు అందజేసి అభినందించారు.

## ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నా భోజనం పథకం ప్రారంభం



నర్సీపట్నం: ఇంటర్మీడియేట్ విద్యార్థులకు మిడ్డేమిల్స్‌ను అందజేయడం మంచి పరిణామమని ఎంపిపి సుకల రమణమ్మ అన్నారు. బుధవారం వేములపూడి జూనియర్ కళాశాలలో మధ్యాహ్నా భోజనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలేజీలో 140 మందికి భోజనాన్ని అందజేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాఠశాల విద్యార్థులతో పాటు కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నా భోజన పథకం కింద భోజనాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నారావు, సత్యసునీల్, సర్పంచ్ బోళెం కుమారిలక్ష్మి, మాజీ సర్పంచ్ నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వివక్షతకు పరిష్కారం చూపాలి

### రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్




ఆంధ్రవిశ్వవిద్యాలయం: ఏయూలో సమాజంలో విభిన్న రూపాలలో దర్శనమిస్తున్న వివక్షలకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్ అన్నారు. బుధవారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ స్టడీస్ కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సమానంగా జీవించే విధానాలను రూపొందించడం అవసరమన్నారు.

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరొలినా గ్రీన్స్‌బొరో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీస్ అండ్ కాన్ఫ్లిక్ట్ స్టడీస్ కేంద్రం ఆచార్యులు డాక్టర్ జిరిమ్ రింకర్ మాట్లాడుతూ భాషకు అంతర్గత అర్ధం ఉంటుందన్నారు. బయటి వ్యక్తిగా వివక్షతనుతెలుసుకునే ప్రయత్నం చేసానన్నారు. ప్రజల మధ్య శాంతిని నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. శాంతి ప్రజలమధ్య బలమైన సామాజిక బంధాలను వేసే సాధనంగా నిలుస్తుందన్నారు.

కేంద్రం సంచాలకులు ఆచార్య పి.డి సత్యపాల్ మాట్లాడుతూ సమాజంలో వర్ణం, లింగ, ప్రాంత, భాష, కుల వివక్షతలు నేటికీ మనకి కనిపిస్తున్నాయన్నారు. వర్ణ, లింగ, ప్రాంత వైరుధ్యాలు బయలకు కనిపిస్తాయని, భాష వినిపిస్తుందని, ఎటువంటి రూపం లేని కుల వివక్షత వీటికంటే అధికంగా దర్శనమిస్తుందన్నారు. రూపం లేకున్నా మన సమాజంలో కులం మనుగడ సాగిస్తోందన్నారు. ప్రజలకు విభజించడానికే కులం ఉందన్నారు.

కార్యక్రమంలో కేంద్రం సిబ్బంది, వర్సిటీ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జిరిమి రింకర్‌ను వర్సిటీ తరపున సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

## అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

### అధికారులకు మంత్రి అయ్యన్న ఆదేశాలు



నర్సీపట్నం: నియోజకవర్గంలో చేపట్టిన వివిధ ఇంజనీరింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బిశాఖాధికారులను రోడ్లు భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో వివిధ పనుల పురోగతిని గురించి ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ పథకాలకు మంజూరు చేసిన నిధులను వేగంగా ఖర్చుచేసి పనులను పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని లేకపోతే పెద్ద వర్షాలు తుఫాన్లు వస్తే పనులు సాగకపోవడం, దానివల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. అవసరమైన మంజూరులను వేగంగా పొందాలని ఏమైనా ఇబ్బంది ఉంటే తక్షణం తన దఅష్టికి తేవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలోని ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పర్యవేక్షక ఇంజనీర్లకు, కార్యనిర్వాహక ఇంజనీర్లకు మంజూరు అధికారాలు పెంచామన్నారు. కఅష్ణదేవి పేట రోడ్డు పనులు, శారదానగర్ వై జంక్షన్ రోడ్డు పనులు, వివిధ గ్రామాల మధ్య పంచాయతీరాజ్ రోడ్లు ఏ దశలో ఉన్నాయనే విషయంపై మంత్రి సమీక్షించారు. పెదబడ్డేపల్లి కూడలిలో రోడ్డు పనులు పూర్తయినందున వెంటనే విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, నిధులు, అవసరమైన మంజూరు పత్రాలు, తగిన ఆదేశాలు ఇస్తున్నప్పటికీ పనుల్లో జాప్యం జరగడం సరికాదన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ రమేష్ కుమార్, వేణుగోపాల్, ఏ ఈ మూర్తి, పంచాయతీరాజ్ డిఈ సత్యంనాయుడు, పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ఈఈ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భీమునిపట్నం : భీమిలి మండలం టి.నగర పాలెం పంచాయతీ లో గ్రామ దర్శిని - గ్రామ వికాసం కార్యక్రమంలో మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ముందుగా ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహా విష్కరణ చేసారు. అనంతరం సామాజిక భవనం, పాఠశాల భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అలాగే మంచినీటి పథకం, సామాజిక భవనం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాలా కష్టపడి పనిచేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ లో మంచి నీరు, కాలువలు, రోడ్లు పరిశుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. అనంతరం దీవిస్ లేబరేటరీస్ వారి సహకారం తో మహిళలకు గ్యాస్ స్టవ్ లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిర విజయ్ బాబు, ఎం.డి.ఓ.కె హరిప్రసాదరావు , డిఎల్డిఎ చైర్మన్ గాడు వెంకటప్పుడు, ఏఎంసీ ఛైర్మన్ కోరాడ నాగభూషణరావు, గిడ్డంగుల డైరెక్టర్ మణి శంకర నాయుడు, భీమిలి మండల ఎంపీపీ యరబాల కృష్ణ వేణి అనిల్ ప్రసాద్, భీమిలి మండల పార్టీ ప్రెసిడెంట్ డిఏఎన్ రాజు, జెడ్పీటీసీ అప్పారావు , జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కురిమిన లీలావతి, కోరాడ రాజబాబు, టి నగరపాలెం సర్పంచి రాము, ఎంపీటీసీ చిట్టిబాబు,భీమిలి తగరపువలస డివిజన్ అద్యక్షులు గంటా నూకరాజు, కొప్పల రమేష్ , వార్డు సభ్యులు, జన్మభూమి కమిటీ సభ్యులు, సర్పంచులు, ఎమ్పీటీసీలు, దివీస్ కోర్పరేట్ సామజిక బాద్యత అదికారి ఇ.ఎస్ నాగరాజు, సిబ్బంది, టి.డి.పి నాయుకులు పాల్గొన్నారు.




## కీలక వడ్డీరేట్లు మళ్లీ పెరిగాయ్

ముంబయి: వరుసగా రెండో సమీక్షలోనూ కీలక వడ్డీరేట్లను పెంచేసింది భారత రిజర్వ్ బ్యాంక్. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమావేశం జులై 30 నుంచి మూడు రోజుల పాటు జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా కీలక వడ్డీరేట్లను పావుశాతం మేర పెంచుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది.

దీని ప్రకారం.. ప్రస్తుతం 6.25 శాతంగా ఉన్న రెపో రేటు 6.50శాతానికి పెరిగింది. ఇక రివర్స్ రెపో రేటును కూడా 6 శాతం నుంచి 6.25 శాతానికి పెంచారు. ఇక ఎంఎస్ఎఫ్ రేటు, బ్యాంకు రేటను 6.75 శాతంగా వెల్లడించింది. ఈసారి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉండొచ్చని కొందరు అంచనా వేశారు. అయితే చమురు ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో వడ్డీరేట్ల పెంపుకే ఆర్‌బీఐ మొగ్గుచూపింది. కాగా.. ఆర్‌బీఐ వడ్డీరేట్లను పెంచడం వరుసగా ఇది రెండోసారి. జూన్‌లో జరిగిన రెండో ద్వైమాసిక సమీక్షలోనూ పావుశాతం మేర పెంచడం గమనార్హం.

***రిటైల్ ద్రవ్యోల్బణం 4.8శాతం***

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.8శాతంగా నమోదుకావొచ్చని ఆర్‌బీఐ ఈ సమీక్షలో అంచనా వేసింది. మద్దతు ధరను పెంచడంతో ఆహార పదార్థాల ధరలు పెరిగే అవకాశాలున్నాయని దీంతో ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుందని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది. జులై-సెప్టెంబరు త్రైమాసికంలో ఈ ద్రవ్యోల్బణం 4.6శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. ఇక 2019-20 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం నాటికి రిటైల్ ద్రవ్యోల్బణం 5శాతానికి పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయని పేర్కొంది.

***జీడీపీ 7.4శాతం***

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధిరేటు అంచనాల్లో ఆర్‌బీఐ ఎలాంటి మార్పులు చేయలేదు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధి 7.4శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేసింది.

ప్రథమార్థంలో 7.5-7.6శాతం వృద్ధి, అక్టోబర్-మార్చి మధ్య 7.3 నుంచి 7.4 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.5శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేసింది.

*రుణాలు ప్రియం..*

కీలక వడ్డీరేట్ల పెంపుతో భవిష్యత్‌లో బ్యాంకు రుణాల రేట్లు మరింత భారం కానున్నాయి. ఆర్‌బీఐ వడ్డీరేట్లు పెరిగితే ప్రభుత్వ, ప్రయివేటు రంగ బ్యాంకులు తమ రుణాలపై కూడా వడ్డీరేట్లను పెంచుతాయి. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు మరింత ప్రియమయ్యే అవకాశాలున్నాయి.

## నేటి నుంచే గ్రామదర్శిని



భీమునిపట్నం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న గ్రామదర్శిని కార్య క్రమాలు ఈ నెల రెండు నుంచి పది హేనవ తారీఖు వరకూ ప్రతీ గురు వారం, శుక్రవారాల్లో ఈ కార్య క్రమాలు నిరవహి స్తున్నట్లు భీమిలి జోనల్ కార్యా లయం సమా వేశంలో కమి షనర్ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. నోడల్ అధి కారులు, డిపార్ట్‌మెంట్ అధికారుల పాల్గొం టారని తెలిపారు, ఈ సమావేశంలో టి.పి.అర్.ఓ.శ్రీనివాస్, ఏ.సి.పి, డి.ఇ, భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా నూకరాజు, కొప్పల క్రిష్ణ, కె.అప్పన్న పాల్గొన్నారు

## ప్రకాష్‌బాబుకు వర్సిటీ డాక్టరేట్

ఆంధ్రవిశ్వవిద్యాలయం: ఏయూలో న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి చింతా ప్రకాష్ బాబుకు హ్యూమానిటీస్ అండ్ డ్యూటీస్‌లో డాక్టరేట్ లభించింది. కళాశాల పూర్వ ఆచార్యులు యలమంచిలి సత్యనారాయణ పర్యవేక్షణలో 'హ్యూమన్ రైట్స్ ఆఫ్ వల్లరబుల్ గ్రూప్స్ విత్ రిఫరెన్స్ టు వుమెన్ అండ్ చిల్డ్రన్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు తన కార్యాలయంలో ప్రకాష్ బాబుకు ఉత్తర్వులు అందజేసి అభినందించారు.

మహిళలు, చిన్నారులను, వయోవృద్దులను పరిరక్షించడానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కులను పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.సూర్య ప్రకాశ రావు, కళాశాల ఆచార్యులు ప్రకాష్ బాబును అభినందించారు.

## అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలతోనే ఆరోగ్యం ..

### ఐ .సి.డి.ఎస్ అర్బన్ -1 సూపర్ వైజర్ రాజేశ్వరి ...



కంచరపాలెం : అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రి పాలతోనే చక్కటి ఆరోగ్యం చేకురుతుందని ఐ .సి.డి.ఎస్ అర్బన్ -1 సూపర్ వైజర్ రాజేశ్వరి పేర్కొన్నారు. ఈమేరకు ఆర్.అండ్.బి కూడలి వద్ద నున్న ఐ .సి.డి.ఎస్ అర్బన్ -1 కార్యలయంలో బుదవారం ఉదయం తల్లి పాల వరోత్సవాల్లో బాగంగా పరిసర ప్రాంతల్లో తల్లి పాల ప్రాముఖ్యతపై పలువురి అవగహన కల్పిస్తూ ర్యాలీ నివహించారు. ఈసందర్బంగా ఆమే మాట్లడుతూ . అప్పుడే పుట్టింన బిడ్డకు మొదటి టీకా తో పాటుగా తల్లి ముర్రి పాలు తప్పగా అందించాలన్నారు. బిడ్డకు క్రమం తప్పకుండా తల్లి పాలు అందించడం వలన రొమ్ము క్యాన్సర్ భారిన పడకుండా వుంటారని తెలియజేశారు. కార్యక్రమంలో వివిద అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృషి కల్యాణ్ అభియాన్‌తో రైతులకు మేలు

కొయ్యూరు : కేంద్రం అమలు చేస్తున్న కృషి కల్యాణ్ అభియాన్‌తో రైతులకు మేలు జరుగుతుందని ఏఒ విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతులకు పవర్ టిల్లర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు యంత్రం ద్వారా విత్తనాలను వేసుకోవచ్చునన్నారు. కృషి కల్యాణ్ అభియాన్‌లో దేశవ్యాప్తంగా 174 గ్రామాలను ఎంపిక చేశారని, దానిలో రాజేంద్రపాలెం ఒకటని చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# విజయభాను

## సంపాదకీయం

### అసోం వివాదం

అసోంలో భారత పౌరులను గుర్తించే నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్సీ) పేర పౌర జాబితా వెలువడింది. దీనిలో లక్షలాదిమంది పేర్లు లేకపోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నది. 2015 మేలో పౌరసత్వ నమోదు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. 68లక్షల 27వేల కుటుంబాల నుంచి సుమారు మూడు కోట్ల ముప్ఫై లక్షల మంది దరఖాస్తు చేసుకోగా రెండుకోట్ల తొంభై లక్షల మందికి మాత్రమే జాతీయ పౌరసత్వ జాబితాలో చోటు దక్కింది. నలభై లక్షల మందికి పౌరసత్వ జాబితాలో చోటు దక్కకపోవటానికి గల కారణాలపై ఆసక్తి, ఆందోళన వ్యక్తమవుతున్నది. అయితే పౌరజాబితా రూపకల్పనలో ప్రధాన భూమిక పోషించిన భారత రిజిస్ట్రార్ జనరల్, ఎన్ఆర్సీ రాష్ట్ర సమన్వయకర్త మాత్రం, పౌరసత్వ జాబితాలో పేరు లేకపోవటానికి కారణం బహిరంగంగా చెప్పబోమనీ, వ్యక్తిగతంగా వివరిస్తామని చెప్పటం పట్ల భయ సందేహాలు వ్యక్తమవటం సహజం. అయితే దేశంలో 1951 తర్వాత పౌరసత్వ నమోదులో మార్పులు చేర్పులు జరుగుతున్న రాష్ట్రం ఒక అసోం మాత్రమే. అంటే ఏదో స్థాయిలో వలస సమస్య ఉన్నదన్నది నిజం. 2001 జనాభా లెక్కల ప్రకారం పదేండ్ల కాలంలో అస్సామీ మాట్లాడే వారు పది శాతం తగ్గితే, బెంగాలీ భాష మాట్లాడేవారు ఏడు శాతం పెరిగారు. ఇప్పుడు అసోం జనాభాలో బెంగాలీలు మూడింట ఒక వంతుగా మారిపోయారని అధికారిక గణాంకా లు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోంచే అస్సాంలో ఆందోళన పెరిగి, దేశంలో ఎక్కడా లేని విధంగా పౌరులను గుర్తించే కార్యక్రమం చేపట్టవలసి వచ్చింది.

అసోంలో విదేశీయులు, అక్రమ వసలదారుల సమస్య సుదీర్ఘమైనది. బంగ్లాదేశ్ అవతరణ తర్వాత విదేశీ వలసదారుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయిందనీ, వారి రాకతో స్థానికులే మైనారిటీలుగా మారిపోయిన దుస్థితి ఏర్పడిందనే వాదన తీవ్రమైంది. ముఖ్యంగా విద్యా, ఉద్యోగాల్లో కూడా వలసదారులదే ఆధిపత్యం అయిపోయిందని అస్సామీలు ఉద్యమబాట పట్టా రు. 1980వ దశకం నాటికి ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (ఏఏఎస్యూ) ఏర్ప డి అక్రమ వలసదారుల వ్యతిరేక ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలోంచే 1985లో ఏఏఎస్యూ, అసోం రాష్ట్రప్రభు త్వం, రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభు త్వం మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందంలో 1971 మార్చి 24 తర్వాత వల స వచ్చిన వారందరినీ అక్రమ వలసదారులు గా గుర్తించి వారి స్వస్థలాలకు, దేశాలకు పంపాలని నిర్ణయించారు. దానికి 3డీ ఫార్ములా ప్రకారం ముందుకు పోవాలని ఉపక్రమించా రు. 3డి ఫార్ములా.. 1డి-డిటెక్షన్ (గుర్తింపు), 2డి-డిలీషన్ (తొలగింపు), 3డి-డిపోర్టేషన్ (పంపించేయటం) ప్రకారం అక్రమ వలసదారులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. దీని ప్రకా రం.. 1951-61 మధ్య వచ్చిన వారికి పౌరసత్వంతో పాటు, ఓటు హక్కు ఇవ్వాలనీ, 61-71 మధ్య వచ్చిన వారికి పౌరసత్వం మాత్రమే ఇచ్చి, ఓటు హక్కు ఇవ్వరాదనీ, 1971 మార్చి 24 తర్వాత వచ్చిన వారిని అక్రమ వలసదారులుగా గుర్తించి పంపేయాలని సూత్రీకరించారు. 1951ని ప్రాతిపాదికగా తీసుకుని వలసదారులను గుర్తించే ప్రక్రియ ముందుకు సాగలేదు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా, చివరికి అసోంలో ఏజీపీ అధికారంలో ఉన్న కాలంలో కూడా అక్రమ వలసదారులను గుర్తించటంలో అడుగు ముందుకు పడలేదంటే సమస్య ఎంత సంక్లిష్టమైనదో తెలుస్తున్నది.

జాతీయ పౌరసత్వ జాబితాలో పేరు లేకపోయినంత మాత్రాన ఎవరూ భయభ్రాంతులకు గురి కావలసిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తున్నది. అయినా కేంద్రం అసోంలో రెండువందల కంపెనీల పారామిలిటరీ బలగాలను దించి పరిస్థితిని డేగకండ్లతో గమనిస్తున్నదంటే పరిస్థితి తీవ్రతను, సున్నితత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. మరోవైపు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఒక్క పౌరుడిని కూడా తమ దేశంలోకి అనుమతించబోమని ప్రకటించటం గమనించాలి. ఎవరూ తమ వారు కాదని, తమ భూ భాగంలో కాలుపెట్ట నీయమంటే, వారు ఎక్కడికి పోతారు? అస్సాంలో పరిస్థితి పట్ల పార్లమెంటులో అన్నిపార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కానీ ఈ పరిస్థితికి పలు పార్టీల బాధ్యత ఉన్నది. తమ భూభాగంలో తామే అల్పసంఖ్యాకులుగా మారిపోవడమై నా, పరాయి పెత్తనం నెలకొనడమైనా ఏ జాతీ అంగీకరించదు. అసోంలోకి వలసలు మొదలై స్థానికులు ఆందోళన ప్రారంభించిన తొలి దశలోనే నాడు కేంద్ర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ బాధ్యతాయుతంగా, దీర్ఘకాలిక దృష్టితో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ సమస్య ఇంత సంక్లిష్టంగా మారేది కాదు.

## ఎస్ఆర్‌బి కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన సీతారాం



అనకాపల్లి : క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి ఎంతైనా అవసరమని, ఎస్ఆర్‌బి ఇండస్ట్రీ చైర్మన్ కొణతాల సీతారాం అన్నారు. బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న ఎస్ఆర్‌బి ఇండిపెండెన్స్‌డే ఉత్తరాంధ్ర క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు, క్రీడలలో ప్రాముఖ్యత, నైపుణ్యతను పెంపొందించుకోవాలని, తద్వారా ఉన్నత శిఖరాలకు అదిరోహించేందుకు క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని ఆయన అన్నారు. క్రీడలలో గెలుపు, ఓటమిలు సహజమని, గెలిచామని ఆనందం, ఓటమి చెందామని, నిరాశలు క్రీడాకారులకు ఉండకూడదని, ఆయన హితవు పలికారు.

అనకాపల్లి పట్టణంలో 2007లో జార్జీక్లబ్‌లో ఎస్ఆర్‌బి ఇండస్ట్రీయల్ నేతృత్వంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించామని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బహుమతిగా 30వేలు, ద్వితీయ బహుమతి 20వేలు, షీల్డు బహుకరించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే విజయ నగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి, సుమారు 80 టీములు, పాల్గొన్నాయని ఆయన తెలిపారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజువరకు జరుగుతున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానోత్సం కార్యక్రమం జరుగుతుందన్నారు. పెంటకోట జగదీశ్వర రావు పరివేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కొణతాల మురళీ, దాడి కృష్ణ, ఎల్లపు తాతాజీ, యల్లపు చక్రవర్తి, ఆర్గనైజర్స్ కర్రి రుద్రి, దాడి బుజ్జి, తదితరులతో పాటు ఎన్టీఆర్ గ్రౌండ్ క్రికెట్ ప్లేయర్స్ పాల్గొన్నారు.

## కుట్టుమిషీన్ నిర్వహణ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన గంగవరం పోర్టు




గాజువాక: గంగవరం పోర్టు ఆధ్వర్యంలో 7వబ్యాచ్ కుట్టుమిషీన్ నిర్వాహణ కార్యక్రమాన్ని మహిళలకోసం బుధవారం ప్రారంభించింది. ఈ సంధర్బంగా గంగవరం పోర్టు యాజమాన్యం మాట్లాడుతూ మహిళలకు కుట్టుమిషీన్ శిక్షణ కార్యక్రమం, ఉచితంగా మిషీన్‌లను అందించడానికి ప్రధాన కారణం మహిళలు సాధికారకత,నాణ్యమైన జీవనం పొందడానికేనని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సుమారు 50మంది మహిళలను శ్రీనగర్ రీహాబిలిటేషన్ కాలనీ నుంచి ఎంచుకున్నట్లు తెలిపారు. కుట్టుకు సంబంధించి ప్రాధమిక సూత్రాలు, క్లాతింగ్‌డిజైన్స్ వంటివి నేర్పుతున్నట్లు తెలిపారు. వడ్లపూడిలోని ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్ ఆధ్వర్యంలో శిక్షణ నివ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికేట్స్‌తో పాటు కుట్టుమిషీన్‌లను ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా అప్పెరల్ పార్క్స్ వద్ద ఉపాధిని కూడా పొందే అవకాశం కల్పిస్తున్నటుతెలిపారు. ఇప్పటి ఈ శిక్షణ వలన మహిళలు ఆర్థికంగా నిలదొక్కేఅవకాశం ఉందని అన్నారు. అలాగే ఇంతవరకు జిపియల్ 9బ్యాచ్‌ల ద్వారా సుమారు 309మంది మహిళలకు శిక్షణ నివ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం వలన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని, దీనికి మంచి స్పందన వస్తుందని అన్నారు. పరిసరప్రాంత మహిళల ఉన్నతికి కార్యక్రమాలను చేపడుతూనే ఉంటామని, నిర్దేశిత లక్ష్యాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గంగవరం పోర్టు ప్రతినిధులు వైస్ ప్రెసిడెంట్ (ఆర్ అండ్ ఆర్ మరియు సెక్యూరిటీ) బి.బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ (లయజన్ అండ్ సెక్యూరిటీ)ఎల్.పీస్.రామునాయుడు, వి.పీ (హెచ్ఆర్) ఎం.గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గొర్లివానిపాలెంలో రక్షిత మంచినీటి పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు



శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు, సర్పంచ్ శ్రీనువాసరావు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయితీ గొర్లివానిపాలెం గ్రామం దరి గంగిరెడ్డి కాలనీలో పంచాయితీ 14వ ఆర్థిక ఫైనాన్స్ నిధులు 11లక్షలతో అరవైవేలు లీటర్ల సామర్థ్యం గల నూతన రక్షిత మంచినీటి సరఫరా ట్యాంక్‌ను పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రాణీణ ప్రాంతాల్లో అనేక సంక్షేమ పథకాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతులు అభివృద్ధే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అనంతరం మేజర్ పంచాయితీ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీనువాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారును ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎం.మహలక్ష్మి నాయుడు, గవర అప్పారావు, కొటాన అప్పారావు, బుచ్చిరాజు, శరగడం శంకరరావు, దొడ్డి ప్రకాష్, గండి దేముడు, కె.శ్రీనువాసరావు, ఎం.అక్కుబాబు, రఘునాథ్ బాబు, వార్డు మెంబర్లు గండి దేముడుబాబు, భైలపూడి దేముడుబాబు, కొటాన వెంకటరమణ, కర్రి తాతబాబు తదితరులు పాల్గొన్నారు.




బార్ కౌన్సిలింగ్‌లో ఎన్నికైన శుభ సందర్భంగా విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.భానుమతి ముఖ్య అతిథిగా విచ్చేసి ఎస్.కృష్ణ మోహన్, పి.నరసింగరావు, కె.రామజోగేశ్వరరావు, బైపా అరుణ్‌కుమార్‌లకు ఆమె సన్మానించారు.

## కవి సమయం

### ‘శక్తే దైవం’

యమక లేళ లెగిసి - శ్రమయే దైవం అనిపించు
శ్రమతో అడుగులు - వేయుట మన వంతు
సోమరి నడకలు నడవద్దు
సోకులు ఖర్చులు తగ్గించు.
పొదుపుకు శ్రద్ధ వహించు
దుబార ఖర్చులు వద్దంటు.
మోపులు మోయుట మన వంతు
నీతిగ బతుకుట జనమంటు.
ప్రగతి పథం - మహతి రథం గావించు
భారత భూమికి - విలువలు తెప్పించు
చదువులు తోను చక్కదిద్దు
వినయం పదిల బరచు
వ్యసనానికి - బలికావద్దు
యువతరానికి - ఇది బలవంతు
మీలో వున్న శక్తే దైవం
మీలో వున్న భక్తే దైవం
భావి తరాలకు భాగ్యాలు కల్పించండి
విద్యావంతులు చేయండి

... కవిత రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

## పంచాంగం

మాసం : నిజ జ్యేష్ఠ ; తిథి : పంచమి 7.37; ఉత్తరాభాద్ర ఉ.10.30; రా.వ.10.53ల 12.32 | గురువారం 02-08-2018

**మేషం:** స్త్రీలకు తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదుర్కొనక తప్పదు. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపారులకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు. **వృషభం** : రాజకీయాల్లో వారి కార్యక్రమాలు వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవుతారు. మీ సరదాలు కోరికలు వాయిదావేసుకోవాల్సివస్తుంది భాగస్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన కలిగిస్తుంది. **మిథునం** :వ్యాపారాల్లో గణనీయమైన పురోభవృద్ధి సాధిస్తారు. భార్యాభర్తల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తుతాయి. కలప, సిమెంట్, ఇసుక రంగాలలో వారికి లాభదాయకం. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తారు. దీర్ఘకాలిక పెట్టుబడులు, కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్త్రీలకు ఆహార, ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. **కర్కాటకం** :స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలకు అనుకూలం. ఖర్చులు బాగా పెరిగే ఆస్కారం ఉంది. ధన వ్యయంలో ఏకాగ్రత అవసరం. ప్రముఖుల కలయిక సాధ్యము కాదు. ఉద్యోగస్తులు సమర్థవంతంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఇసుక కాంట్రాక్టర్లకు అధికారుల నుంచి ప్రతికూలతలు ఎదుర్కొంటారు. మీ ఔన్నత్యాన్ని ఎదుటివారు గుర్తిస్తారు. **సింహం** : బ్యాంకు పనుల్లోను, వాహనం నడుపు తున్నప్పుడు ఏకాగ్రత వహించండి. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఒక శుభకార్యాన్ని ఘనంగా నిర్వహిస్తారు. స్త్రీల, ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఆత్మీయులను కలుసుకుని మీ బాధలు చెప్పుకోవాలనిపిస్తుంది.


## కాలుష్యం తగ్గించాం

### నియోజకవర్గం అభివృద్ధి చేశాం : ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం: : దక్షిణ నియోజకవర్గంలో కాలుష్యాన్నీ గణనీయంగా తగ్గించామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు కాలుష్యంతో నరకయాతన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం కృషి కారణంగా కాలుష్యం తగ్గిపోయిందని స్పష్టం చేశారు. 28వవార్డులో నగర దర్శిని కార్యక్రమంలో పాల్గొన్నారు. నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తున్నామని, పేదల కోసమే 23వేల ఇళ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బంటుపల్లి సూర్యనారాయణ, విల్లూరి డాక్టర్ చక్రవర్తి, బుచ్చా రామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా చిన్న కథలు



### ‘అమృతస్య పుత్రః’

అదే నిజమైన త్యాగము. త్యాగము వలన వైరాగ్యము, వైరాగ్యము వలన యోగము'' అని బోధిస్తూ, అతనిని ఆలింగనం చేసుకున్నాడు.'' కానీ ఆ వ్యక్తి వణికి పోతూ వున్నాడు. భయం. ఆనందం అతనిలో కలుగుతున్నది. ‘‘స్వామీ! నా పాపములు మిమ్ములను అంట కుండుగాక'' అని అన్నాడు అతడు.


చైతన్యుడు అతనిని అమాయకత్వమునకు నవ్వుతూ ‘‘అమాయ కుడా? ఇక్కడ నీవు, నేను ఒకటే. ఇదిగో నామమును ఉపదేశిస్తు న్నాను'' అని చెవిలో ఏదో నామమును పలికాడు. చైతన్యుడు పలికిన నామము ఆ వ్యక్తి హృదయాల్ని సూటిగా తాకింది. ఆ క్షణములోనే అతనిలో పరివర్తన కలిగింది. ఆనందంతో ‘‘స్వామీ! నావంటి భాగ్యశాలి ఎవరూ ఉండరు. నేను పతితుడను కాను. పావనుడను. నన్ను ఇంత కాలము అంటుకుని వున్న దేహభ్రాంతి యీ క్షణము నుండి నన్ను వీడినది. ‘‘నేను నేనే'' అని తెలుసు కున్నాను. నేను అమృత పుత్రుడను'' అని చైతన్యునితో పలికాడు.

### పునరపి జననం

బలిచక్రవర్తి యొక్క కుమార్తె రత్నమాల బలిచక్రవర్తిని దానము అడిగే నిమిత్తము వచ్చిన వామనమూర్తిని చూచింది. దివ్యతేజస్సుతో, ముద్దులొలుకు మోముగల ఆ వటువును చూసి ‘‘ఆహా! ఎవరీ సుందరమూర్తి! మహా తేజోవంతుడుగా ఉంటున్నాడు. సమస్త కళలు ఇతని యందు మూర్తీభవించి యున్నవి. షోడశకళలతో వెలిగిపోతున్న ఈ బాలుడే నాకు పుత్రుడుగా జన్మించి వుంటే ఎంత బాగుండేది. అంతటి అదృష్టము కలుగుట సాధ్యమా! ఆ బాలునికి ప్రేమతో పాలిచ్చి లాలించి పాలించే భాగ్యము వుండేది కదా!'' అని అనేక విధములుగా భావన చేసింది. అట్లు ఊహాలోకంలో పారవశ్యముతో మునిగి వున్నప్పుడు ఆమె వామనుడు తన తండ్రికి ఏమి అడిగినాడో, తన తండ్రి ఏమి యిస్తున్నాడో, అసలు అక్కడ ఏమి జరుగుతుందో గుర్తించలేదు. కొంత సేపటికి ఆమె కన్నులు తెరచి చూచేటప్పటికి తాను చూచిన దృశ్యము సహించలేకపోయింది. తన తండ్రి తలపై వామనుడు పాదము పెట్టి అణగద్రొక్కడం జరిగింది. రత్న మాలకు పట్టరానంత కోపము వచ్చింది. చిందులు త్రొక్కుతూ ‘‘నా తండ్రి శిరస్సుపై ఒక బీద బ్రాహ్మణుడు కాలు పెట్టి పాతాళమునకు అణగద్రొక్కుటయా!'' అని ఆవేశముతో లేచింది. ఆమెలోని రాక్షసత్వం పైకి ఉబికింది. వామనుని చంపాలని ప్రయత్నించింది. బలిచక్రవర్తి సమయస్ఫూర్తితో ఆమెను సమాధానపరిచాడు. ఒక నిముషంలో ప్రేమ, మరొక నిముషంలో ద్వేషం ఈ రెండు పరస్పర వైరుధ్య ఉద్వేగాలకు గురి అయింది ఆమె. వామనునికి పాలివ్వాలని ఒక కోరిక.

...సశేషం

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## విద్యార్థినీ, విద్యార్థులకు
# బస్‌పాసులు పంపిణీ



భీమునిపట్నం : భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా నూకరాజు, టీడీపీ అధికార ప్రతినిధి మారోజు సంజీవ్ కుమార్‌లు శ్రీ పొట్టి శ్రీరాములు ప్రాథమికోన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత బస్ పాసులు పంపిణీ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో నూకాలమ్మ అమ్మవారి దేవ స్థానం చైర్మన్ కాసరపు నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గిడు తూరి శ్రీనివాసరావు,తెలుగు యువత అధ్యక్ష,కార్యదర్శులు కనకల అప్పలనాయుడు,కంచెర్ల కామేష్,యువత అధికార ప్రతినిధి దంతులూరి సిద్ధార్థ వర్మ ,డింగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 4న మాస్టర్ సివివి 150వ జయంతి ఉత్సవ వేడుకలు

విజయనగరం : జగద్గురు పీఠం విజయనగరం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో పరమ గురువు మాస్టర్ సివివి యొక్క 150వ జయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని నిర్వాహకులు యు.వి.ఎ.ఎన్. రాజు తెలిపారు. 4వ తేదీ ఉదయం 4గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జరిగే జయంతి ఉత్సవ వేడుకల్లో (గురుపూజా మహోత్సవం)భాగంగా బెంగుళూరుకు చెందిన రామ్ ప్రసాద్ జోషి ప్రవచనం ఉంటుందని, పూజాదికాలు, అభిషేకాలు, సమారాధనలతో పాటు సుపథ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్య క్రమాలు ఉంటాయని, ఈ వేడుకల్లో కె.ఎస్.మాధవరావు, కంచర్ల రాజేశ్వరరావు, వి.అచ్యుత రామారావు తదితరులు పాల్గొంటారని ప్రకటనలో తెలిపారు.

# ఆక్రమణలో బ్రాహ్మణ చెరువు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని కొత్తపేట ప్రాంతంలోని అయ్యవారి బ్రాహ్మణ చెరువును కొంత మంది ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఇటీవల ఒక టైల్స్ వ్యాపారి కొంత స్థలాన్ని ఆక్రమించుకున్నట్టు వారు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పుడు మరో పక్కన మట్టి వేసి సుమారు రూ.20లక్షల విలువ చేసే రెండు సెంట్లు స్థలాన్ని కబ్జా చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే పట్టణంలోని సన్యాసమ్మ చెరువు 80శాతం కప్పేశారు. అయ్యవారి చెరువును కూడా కబ్జా చేసి ప్రయత్నం జోరుగా జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహశీల్దార్ స్పందించి చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# కష్టపడి చదివి మంచి గ్రేడు సంపాదించాలి

భీమునిపట్నం : తగరపువలస వుయ్ కేర్ యు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తగరపువలసలో గల ప్రభుత్వ పాఠశాలలో 10 వ తరగతి చదువు చున్న విద్యార్థులలో తరగతిలో వెనుకబడి చదువుతున్నారో వారి కోసం ఒక ఉపాధ్యాయుడుని నియమించి వారి వేతనమును భీమిలి మండల రూరల్ వై ఎస్ ఆర్ సి పి నాయకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి ఆర్థిక సాయంతో నియమించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు ఈ క్లాసులను ఉపయోగించుకొని కష్టపడి చదివి మంచి గ్రేడు సంపాదించి మీ తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వుయ్ కేర్ యు కుటుంబ సభ్యులందరు పాల్గొన్నారు అనంతరం ఈ మధ్య రాష్ట్ర యువ సేవాశ్రీ అవార్డు గ్రహీత వెంపాడ శ్రీనివాసరెడ్డి ని వై ఎస్ ఆర్ సి పి నాయకులు శ్రీనివాసరెడ్డి సన్మానించారు. ఇటువంటి అవార్డులు మరి ఎన్నో అందుకోవాలి అని ప్రసంశించారు.

# తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ




అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు : తల్లిపాల వారోత్సవాలపై బుధవారం సిడిపిఒ కార్యాలయ ఆవరణ నుంచి అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు విధిగా ఇవ్వాలన్నారు. తల్లిపాలు తాగిన వారికి తెలివితేటలు అధికంగా ఉంటాయన్నారు.

అన్ని కేంద్రాల్లోను తల్లిపాల వారోత్స వాలను నిర్వహిస్తామని సూపర్‌వైజర్లు తెలిపారు. దీనిలో సూపర్ వైజర్ రాజేవ్వరి, రాజేంద్రపాలెం ఆసుపత్రి సిహెచ్ఒ ఉషాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబును కలిసిన జగదీష్



అనకాపల్లి : విశాఖజిల్లా ఎస్. రాయవరం మండలం, గుడివాడ గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విశాఖ రూరల్ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి సాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసారు.

# గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటిన కర్రిస్వామి

సింహాచలం : మదర్ ఇండియా చారిటబుల్ ట్రస్ట్ కో ఆర్డినేటర్ విజినిగిరి బాల భాను మూర్తి విసిరిన గ్రీన్ ఛాలెంజ్ ను స్వీకరిస్తు స్థానిక టిడిపి నాయకుడు కో ఆపరేటివ్ బ్యాంకు ప్రెశిడెంట్ శ్రీ కర్రి అప్పలస్వామి బుధవారం విజినిగిరిపాలెం మండల ప్రజా పరిషత్ పాటశాల ఆవరణలో మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గ్రీన్ ఛాలంజ్ స్వీకరించి మొక్కలు నాటాను అని ఈ సందర్భంగా ప్రతివక్కరు గ్రీన్ ఛాలెంజ్ స్వీకరించి మొక్కలు నాటి అంధ్రప్రదేశ్ ను హరిత అంధ్రప్రదేశ్ గా మార్చాలని ఈ సందర్భంగా సింహాచల ప్రభుత్వ వైద్యశాల అధికారిని సివిల్ సర్జన్ ప్రభావతి గారికి సింహచలం దేవస్థాన సంస్కృతపాఠశాల ప్రధానో పాధ్యా యులు తమ్మయ్య గారికి మరియు జీవీఎంసీ 6 వ జోన్ కమీషనర్ సత్యనారాయణ గారికి గ్రీన్ చాలంజ్ విసురుతున్నానని చాలంజ్ స్వీకరించి వాకొక్కరు 5 మొక్కల చొప్పున మొక్కలు నాటాలని స్వామి కోరారు.



# భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలుస్తా

*- ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ఎగ్జికూటివ్ మెంబర్*

*- కూన కృష్ణారావుకు ఆత్మీయ సన్మానం*



కంచరపాలెం : ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ఎగ్జికూటివ్ మెంబర్ గా ఎంపికైన కూన కృష్ణ రావుకు పలువురు భవన నిర్మాణ కార్మికులు బుధవారం సన్మానం చేశారు.

ఈ మేరకు స్థానిక జీవీఎంసీ 40 వార్డు భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కమ్యూనిటి హాల్ భవనంలో శ్రీరామాంజనేయ భవన నిర్మాన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఆత్మీయ సన్మానసభ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పూల మాలతో అభినందించారు ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కృష్ణాలో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను నివృత్తి చేసుకుని వారి అభివృద్ధికి తోడ్పడతానని పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల్లో ఉన్న సమస్యలను నా సమస్యగా భావించి ఎప్పటికప్పుడు వాటిని పరిష్కార దిశగా న్యాయం చేస్తానని భవన నిర్మాణ కార్మికులకు భరోసానిచ్చారు. తదనంతరం భవన నిర్మాణ కార్మికులు ఆయనకు పూలమాలలతో సన్మానం చేశారు.ఈ కార్యక్రమములో కాళ్ళ ఆదిబాబు కోశాధికారి సీరపు లక్ష్మన రెడ్డి, సాహు, ఏ బాలాజీ రెడ్డి కె సూరిబాబు, కె శంకర రావు బి తవిటయ్య, అధిక సంఖ్యలో స్థానికులు భవన నిర్మాణ కార్మికులు మహిళలు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలకు రూ.12కోట్లు మంజూరు

### రోడ్లు భవనాల శాఖ మంత్రి సిహెచ్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాలకు అదనపు భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 12 కోట్లు మంజూరు చేసినట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. బుధవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ దీనికి సంబంధించిన ఉత్తర్వులను గురించి తెలియజేశారు.

రాష్ట్రంలోని 13 పాలిటెక్నిక్ కళాశాలలకు అదనపు భవనాల నిర్మాణం నిమిత్తం ప్రతి కళాశాలకు రూ.12 కోట్లు చొప్పున రూ.156 కోట్లుమంజూరు చేసినట్లు వెల్లడించారు. స్వర్గీయ ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా పనిచేస్తున్న సమయంలో నర్సీపట్నంలో పాలిటెక్నిక్ కళాశాల స్థాపించినట్లు గుర్తు చేశారు. ఈ కళాశాలల్లో విద్యనభ్యసించిన అనేకమంది నర్సీపట్నం విద్యార్థులు ప్రస్తుతం ఉన్నతస్థానాల్లో ఉన్నారని, కొందరు విదేశాలలో కూడా ఉన్నారని వారు తరచూ తనతో మాట్లాడుతూ ఉంటారని మంత్రి తెలిపారు. చరిత్ర కలిగిన ఈ పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 12 కోట్లు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు సాంకేతిక విద్య శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# జీతాలు ఇవ్వాలని మంత్రి అయ్యన్నకు లైసెన్స్‌డ్ సర్వేయర్లు వినతి

నర్సీపట్నం : తమకు జీతాలు ఇవ్వాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లు బుధవారం లైసెన్స్‌డ్ సర్వేయర్లు రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్వేయర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 1500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ మండల తహశీల్దార్ కార్యాలయాల్లో గత ఆరు సంవత్సరాల నుండి పని చేస్తున్నారని, కానీ వారికి ఎటువంటి జీత భత్యాలు లేకుండా పని చేస్తున్నారని, జీతభత్యాలు కల్పిం చాలని కోరారు. ఎటువంటి జీతభత్యాలు లేకుండా రైతుల దయా దక్షణాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక భూసంస్కరణ, అభివృద్ధి కార్యక్రమంలో మేము సేవలు అందిస్తున్నామన్నారు. ఉద్యోగ భద్రత గురించి ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించామన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పిఎస్ఎన్.అప్పారావు, సెక్రటరీ బోగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎస్‌విఎస్ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి విన్నవిస్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లు

# ఆర్యవైశ్యులు చట్టసభలకు రావాలి

## ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి




విజయనగరం : ఆర్యవైశ్యులు వ్యాపారాలకే పరిమితం కాకుండా చట్టసభలకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాసనమండలి సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బుధవారం చిత్తూరు జిల్లా పుంగనూరు శ్రీవాసవీ కళ్యాణ మండపంలో జరిగిన చిత్తూరు, తిరుపతి, రాజాంపేటల వాణిజ్య విభాగం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవంలో మాట్లాడారు. వ్యాపారులకు,ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పిస్తోంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని వాణిజ్యవర్గాలకు అండగా ఉన్నపార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గద్దెనెక్కించేందుకు వాణిజ్యవర్గాలు శ్రమించాలన్నారు. ఈ సందర్భంగానిర్వాహకులు శాసనసభా పక్ష ఉపనేత, పుంగనూరు శాసనసభ్యులు డా.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులు మీదుగా ఎమ్మెల్సీ కోలగట్లను సత్కరించారు. ఈకార్యక్రమంలో పార్టీరాష్ట్రఅధికార ప్రతినిధి రీజనల్ కోఆర్డినేటర్ భూమన కరుణాకరరెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు కుప్పం ప్రసాద్, మాజీ పార్లమెంటు సభ్యులు వి.వరప్రసాద్, పిఎసి సభ్యులు గుబ్బా చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మువ్వల నరసింహులు శెట్టి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసనసభ్యులు కె.నారాయణస్వామి, చిత్తూరు పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి శ్రీనివాసులు,మదనపల్లి శాసనసభ్యులు డా.దేశాయి తిప్పారావు, పీలేరు శాసనసభ్యులు డా. చింతలరామచంద్రారెడ్డి, పూతలపట్టు శాసనసభ్యులు డా.సునీల్ కుమార్‌లతో పాటు చిత్తూరు జిల్లా నుంచి అధిక సంఖ్యలో వ్యాపార, వాణిజ్య వర్గాల ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**File No. REV-ULCOSLM(NOC)/178/2018-SA2(ULC2)-VSKPCO**

ఎస్.ఎల్.నెం.330/2018/ సీ.స.
తేదీ: 13/07/2018

జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం
విశాఖపట్నం

### పత్రికా ప్రకటన

**విశాఖపట్నం నగర కాపురస్తులు శ్రీ కనుమూరి శ్రీనివాస రావు (తండ్రి : కృష్ణమూర్తి) ఈ క్రింద పట్టికలో తెలిపిన స్థలమునకు (NOC) "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.**

| గ్రామము పేరు | సర్వేనెం. | విస్తీర్ణము (చ. మీటర్లు) |
|---|---|---|
| మాధవదార | 39/1A1/1A1 | 0.0225 |

**పైన తెలిపిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" (NOC) మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన అందిన 15 దినముల లోగా శ్రీ జాయింట్ కలెక్టర్ మరియు కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలెక్టర్ కార్యాలయము, విశాఖపట్నం వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.**

**G.SRIJANA**
**జిల్లా జాయింట్ కలెక్టర్**
**మరియు కాంపిటేంట్ అథారిటీ**
**అర్బన్ ల్యాండ్ సీలింగ్ విభాగము**
**విశాఖపట్నం**



**అనంతగిరి డంపంగియార్డు నిర్మించొద్దని టోకురు పంచాయతీ పూలగుడ గ్రామస్తులు ధర్నా చేసారు డంపింగ్ యార్డువలన మాగ్రామంలో ఉన్నవారికి మలేరియా మరియు టైపాయిడ్ జ్వరములు వస్తాయని కనుక మాగ్రామములో డంపంగియార్డు వద్దనికె.నర్సన్న కె.రాజు.కె.లక్ష్మి ధర్నా లో పాల్గొన్నారు**

# గర్బిణీలు, బాలింతలకు అవగాహన

రోలుగుంట : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా రోలుగుంట మండలం కొమరవోలు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం 1, 2, 3 సంయుక్తంగా గ్రామంలో గర్బిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. హెల్త్ విజిటర్ విజయ, ఏఎన్ఎంలు తదితరులు కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు.

# సిఎ ఇంటర్‌లో సత్తా చాటిన ఆర్ఎస్ అకాడమీ



వియనగరం : జిల్లా కేంద్రంలోని ఆర్ఎస్ సిఎ అకాడమీ మరోసారి తనసత్తా చాటింది. సిఎ ఇంటర్ ఫలితాల్లో ఆ అకాడమీ విద్యార్థినీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను సాధించారు. ఇటీవల జరిగిన సీఎ ఫౌండేషన్ పరీక్షలో జాతీయస్థాయిలో ఈ అకాడమీకి చెందిన విద్యార్థి 42వ ర్యాంకును సాధించడం జరిగింది. కాగా తాజాగా విడుదలైన సిఎ ఇంటర్ పరీక్షల్లో కూడా ఈ అకాడమీ విద్యార్థినీ విద్యార్థులు ఫలితాల్లో ప్రభంజనాన్ని సృష్టించారు. ఈ ఏడాది మేనెలలో జాతీయ స్థాయిలో సిఎ ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలో ఆర్ఎస్ అకాడమీ విద్యార్థులు 62 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 10 మందికి అత్యుత్తమ మార్కులు వచ్చాయి. 400 మార్కులకు జరిగే ఈపరీక్షలో అకాడమీకి చెందిన ఎ.మమతా 238, పి.మహేష్ 231, సి.హెచ్.అపర్ణ 224, ప్రియాంకారాణి 222, కె.హేమంత్ 218 మార్కులను సాధించారు. అలాగే జి.మంజీరా206, ఎం.సాయి 204, జి.గోపాలకృష్ణ202, సి.హెచ్.లీహారిక, తులసీలు 200 మార్కులు చొప్పున సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులనుఅకాడమీ డైరెక్టర్ అంట్యాకుల రమేష్, అధ్యాపక బృందం అభినందించారు.

# చెరకు తోటలకు ఎర్రకుళ్లు తెగులు

రావికమతం: చెరకు తోటలకు ఎర్రకుళ్లు తెగుల వ్యాపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.సత్తిబాబు, డాక్టర్ ఎన్‌కె.గౌస్‌లు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ తెగులు సోకిన చెరకు ఆకుల అడుగు భాగంలో సన్నటి పసుపు లేదా నారింజ రంగులో ఉండే బొబ్బలు ఏర్పడతాయన్నారు. ఇవి క్రమంగా గోధుమ రంగులోని మారతాయన్నారు. దుబ్బులో ఉండే అన్ని మొక్కలకు ఈ తెగులు సోకుతుందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టకపోతే తోట అంతటికీ త్వరగా తెగులు వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ తెగులు ఉధృతం అయితే ఆకుల మీద తుప్పు మాదిరి బొబ్బల ఏర్పడి, దూరం నుంచి చూస్తే ముదురు గోధుమ రంగులో కనిపిస్తాయన్నారు. ఈ తెగులు నివారణకు మాంకోజబ్ మందు లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే ట్రైదిమార్ఫ్ ఒక లీటరు నీటికి ఒక మిల్లీ గ్రాము లేదా సాపినాబ్ లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి ఆకులు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. 15 రోజులకోసారి రెండు పర్యాయాలు పిచికారీ చేసుకుంటే ఎర్రకుళ్లు తెగులు తగ్గుముఖం పడుతుందని శాస్త్రవేత్తలు సూచించారు.

# ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలి

యానాం: పర్యవరణానికి తీవ్ర నష్టం కలిగిస్తూ మానవల ఆరోగ్యంపై దుష్ప్రభావాన్ని కలిగుస్తున్న ప్లాస్టిక్‌ను అంతటా నిషేధించాలని ప్రజల్లో అవగాహన కలిగించాలని పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. ప్లాస్టిక్ వినియోగ వ్యతిరేక ర్యాలీని పరిపాలనాధికారి కార్యాలయం వద్ద విద్యార్థులు, వర్తకలు చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు, పాల్థిన్ కవర్లు, ప్లాస్టిక్ బాటిల్స్‌ను వినియోగిస్తున్నారని ఎక్కడ బడితే అక్కడ పాల్థిన్ కవర్లు దర్శనమిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో ప్లాస్టిక్ నిషేధించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. షాపులవద్ద ఈ ప్లాస్టిక్ అమ్మకాలు జరగకుండా వ్యాపారులు సహకరించాలన్నారు.

ఎవరైనా అమ్మకాలు చేస్తున్నట్లు తెలిస్తే సంఘపరంగా మాన్పించాలన్నారు. ఈ ర్యాలీ యానాం పురవీధులలో నిర్వహించారు. ప్లకార్డులు, బ్యానర్లు చేతబూని ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని పర్యవరణాన్ని పరిరక్షించాలంటూ విద్యార్థులు, వర్తకలు, నినాదాలుచేశారు. ఈ ర్యాలీలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సోలన్, ఎన్ఎస్‌-ఎస్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, రోంటరీ క్లబ్ అధ్యక్షులు గాజుల బ్రహ్మానందం, సూపరింటెండెంట్ పి. సూర్యనారాయణ, వర్తక సంఘం అధ్యక్షుడు ఎన్. వెంకన్న, కె. బాలక్రిష్ణా, తదితరులు పాల్గొన్నారు.

# 9న రామానుజ గణిత పోటీలు

యానాం: విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంపోందించుట, గణితంలో అవగాహన అభివృద్ధి చేయుటకొరకు ఈ నెల 9న గణిత పోటీలు నిర్వహిస్తున్నట్లు గణిత అకాడమి సేవా సంఘం తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యాక్షుడు ఆనాల వీరభద్రరావు తెలిపారు. ఆశక్తిగల విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ పరీక్షకు హాజరయ్యేటట్లు ప్రోత్సాహించాలన్నారు. నాల్గవ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకావచ్చన్నారు. ప్రథమ పరీక్ష ఈ నెల 9న ఫైనల్ పరీక్ష నవంబర్ 4న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యానాం పబ్లిక్ స్కూల్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ఓటర్లజాబితాపై అభ్యంతరాలు తెలపాలి

యానాం: నియోజకవర్గంలో కొంతకాలంగా ఇల్లు మార్పు జరుగుతున్న ఓటర్లు ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టినప్పటికీ కొంతమంది ఓటర్లు ఇతర చోటికి మారుట, వలసపోవటం కొంతమంది మృతిచెందడం జరిగిందని ఈ ఓటర్ల జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎన్నికల నమోదు అధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు తెలిపారు. ఓటర్ల పేరును సెక్షన్ 21 క్రింద తొలగించడానికి నిర్ణయించినట్లు దీనికి సంబంధించి జాబితాను తయారు చేస్తామన్నారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 4వ తేదీలోగా తగిన ఆధారాలతో అధికారులను కలుసుకోవాలని లేనట్లు అయితే ఓటర్ల జాబితానుండి తొలగించడ జరుగుతుందన్నారు. మిగిలిన వివరాలకు ఆఫీసువేళల్లో అధికారులను సంప్రదించాలన్నారు.

# బాలింతలకు పోషకాహారాలు పంపిణీ



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరంలో స్థానిక అంగనవాడీ సెంటర్ నందు బాల సంజీవిని కార్యక్రమంలో భాగంగా బుధవారం బాలింతలకు బెల్లంతో తయారు చేసిన బెల్లము ఖర్జూరం, చోడిపిండి, శెనగ అచ్చులను గ్రామ సర్పంచి రాజాల.గంగాభవాణి పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రాజాల.చిట్టిబాబు, ఆరోగ్య కార్యకర్తలు, అంగనవాడీ టీచర్లు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్దే చంద్రబాబు లక్ష్యం

## ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు



రావులపాలెం : రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు అన్నారు. బుధవారం మండల పరిధి కేతరాజుపల్లి, ఈతకోట ఆయా సర్పంచ్‌లు కాసా చాముండేశ్వరి, మాసాబత్తుల సుమతిల అధ్యక్షతన నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ఆధ్వర్యంలో గ్రామ దర్శిని, గ్రామ వికాసం కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్ర రావు హాజరయ్యారు. ముందుగా పార్టీ పథాకాన్ని ఆవిష్కరించి గ్రామ దర్శిని, గ్రామ వికాసం కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్ళి కర పత్రాలు పంచుటూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరిస్తూ టిడిపి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని తూచా తప్పకుండా నెరవేరుస్తూ అనేక సంక్షేమ పథకాలను నూతనంగా ప్రవేశ పెట్టిందని, మును పెన్నడూ లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో సిసిరోడ్లు డ్రైనేజి వ్యవస్థను మెరుగుపర్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, ప్రజలు నాలుగేళ్ళ క్రితం, ఇప్పుడు తమ గ్రామాలను బేరీజు వేసుకొకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుత్తుల పట్టాభి రామారావు, పెచ్చెట్టి చిన్నారావు, కాసా విజయ సాగర్, ఆనందరావు, అల్లూరి సత్తిరాజు, గాడి క్రిష్టాఫర్, వైవి, పల్లికొండ సుధీర్, యర్రంశెట్టి సాయి టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆద్వర్యంలో టెన్త్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణ

అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక రావి చెట్టు సెంటర్ వద్ద ఉన్న జిల్లా పరిషత్ స్కూల్ నందు బుధవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాపరిషత్ స్కూల్ నందు టెన్త్ క్లాస్ చదువుచున్న విద్యార్థులకు ఉచితంగా సోషల్ స్టడీ మెటీరియల్స్ ని అందజేశారు.ఈ కార్యక్రమంలో అన్నవరం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎం.సూర్యనారాయణ,సెక్రటరీ సరమర్ల.మధుబాబు,స్కూల్ ప్రధానోపాధ్యారాలు మరియు గ్రామ సర్పంచి రాజాల.గంగాభవాని, రోటరీ క్లబ్ కార్యవర్గ సభ్యులు గంటసాల.వెంకట్, కేశవ్ రాజు , సత్యప్రసాద్, కొండా.వేణు మరియు స్థానిక నాయకులు రాజాలచిట్టిబాబు,రాయి.శ్రీను,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళము



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకముగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి తూ.గో.జిల్లా కోరుకొండ గ్రామానికి చెందిన మిరియాల.కనక మహలక్ష్మి రూ.లక్ష విరాళమును దేవస్థానం పిఆర్వో తులా. రాముడుకు అందజేసి దానిపై వచ్చు వడ్డీతో ప్రతీ సంవత్సరం మాఘ మాసము శ్రావణ శుద్ధ దశమి రోజున మిరియాల.కమల పేరున అన్నదానం జరిపించవలెనని కోరారు.

# 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

పెద్దాపురం: పెద్దాపురం ఎక్సైజ్ పరిధిలోని గంటేపల్లి రంగంపేట, మండలాల్లో జరిగిన దాడులలో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి. నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుండి 5 లీటర్ల సారా, 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణప్రసాద్, పి.ఎస్. సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# అభివృద్ధి పథకాలకు ఎమ్మెల్యే భూమి పూజ

తాళ్లరేవు: మండలంలోని పలు పంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పథకాలకు ముమ్మడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు భూమి పూజ నిర్వహించారు. పూలేకూరు పంచాయతీ పరిధాలోని ఆర్ అండ్ బి రహదారి వంతెనవద్ద నుంచి గొల్లల వంతెన వరకు 1420 మీటర్ల మేర నిర్మించనున్న సిసి రొడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కోరంగిలో డంపింగ్ యార్డు నిర్మాణానికి, పంచాయతీ కార్యాలయంపై అంతస్తు అదునీకరణకు శంకుస్థాపన చేశారు. జార్జిపేట పంచాయతీలో నిర్మించిన అంగన్‌వాడి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఎంపిడి టేకుమూడి అనంతలక్ష్మి, జడ్పిటిసి సి. రామలక్ష్మి, టి. లక్ష్మణరావు, దున్నా సత్యనారాయణ, ఉంగారాల వెంకటేశ్వరరావు, ఆయా గ్రామా సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంగసాయి నాటక సంఘం 8వ వార్షికోత్సవ వేడుకలు



విశాఖపట్నం: 2010 ఆగస్టు 1వ తేదీన నగర ప్రముఖులతో ప్రారంభించబడిన రంగసాయి నాటక సంఘం నాటక, కళారంగాలకు విశేషమైన సేవలను అందించింది. ఈ 8 సంవత్సరాల కాలంలో సుమారు 50 కార్యక్రమాలు నిర్వహించి అందులో 42 నాటిక, నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలలో రంగసాయి నాటక సంఘం అగ్రగామిగా ఉన్నత స్థానంలో నిలిచింది. ఈ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించు కొని బుధవారం నాడు విశాఖపట్నం మద్దిలపాలెంలో గల కళాభారతి ఎ.సి. ఆడిటోరియం నందు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎంప్లాయిస్ పాల్గొన్న స్నేహసాయి ఆర్ట్స్ వారి 'వద్దురా..సోదరా...' నాటికను ప్రదర్శించారు. ఈ నాటికలో నటించేవారందరూ యువ కళాకారులే. ఈ నాటికను ఆళ్ల తరుణ్ చంద్ర కుమార్ రచించగా, శ్రీమతి సేనాపతి సత్యలక్ష్మి దర్శకత్వం వహించగా జి. శరత్ చంద్రగుప్త పర్యవేక్షకునిగా వ్యవహరించారు. ఆద్యంతం నేటి యువతకు మంచి సందేశాన్ని ఇచ్చే ఈ నాటిక విశాఖ ప్రజలను, నాటకాభిమానులను అలరించింది. ఈ కార్యక్రమంలో అతిథులుగా వెలగపూడి ఉమా మహేశ్వరరావు, పైడా కృష్ణప్రసాద్, వి.వి. రమణమూర్తి తదితర ప్రభుత్వ ఉన్నతాధికారులు, నాటకరంగ ప్రముఖులు, పారిశ్రామిక, విద్యావేత్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రథసారథిగి ఎన్ఎన్ఆర్ నిర్వహించారు.

# కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



రావులపాలెం : ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలని, తగిన రీతిలో విద్యావంతులుగా తయారై తమ కాళ్ళపై తాము నిలబడాలని, ప్రతి ఒక్కరు చదువుపై ఆశక్తి కలిగి ఉండాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టిందని కళాశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథక కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ బివైఎన్‌వి ప్రసాద్, అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టి పథకాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వానికి , కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి కె. నరేష్ రెడ్డి, కమిటీ సభ్యులు, విద్యార్థులు, ఫుడ్ టేస్టింగ్ కమిటీ సభ్యులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైకాపాపై తెదేపా నాయకులు తీరుమార్చుకోవాలి

## - గాజువాక వైకాపా మహిళా విభాగం ఆగ్రహం



పెదగంట్యాడ: నిత్యం ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న వైకాపా అధ్యక్షులు వైయస్ జగన్, మహిళా విభాగం అధ్యక్షులు రోజాపై తెదేపా నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు దారుణమని, తెదేపా తీరు మార్చుకోవాలని లేని యెడల తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని గాజువాక వైకాపా మహిళా విభాగం ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం పార్టీ కార్యక్రయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైకాపా రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కటికల కల్పన మాట్లాడుతూ ప్రతిపక్షనేత జగన్ పై తెదేపా చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజల సమస్యలపై వైయస్ జగన్ చేస్తున్న పోరాటానికి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలుకుతుంటే, అధికార పార్టీ నాయకులు విమర్శించడం తగదని అన్నారు. ఇటువంటి చర్యలను మళ్ళీ మళ్ళీ పాల్పడితే వైకాపా చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మహిళా నేతలు పల్లాచినతల్లి, కొయ్యభారతి, నిర్మలరెడ్డి, రోజారాణి, శాంతికుమారి, కె.కనకలక్ష్మి, కరణం లక్ష్మి, బేగం, యమిమా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కంకటాల పుట్టిన రోజు



రావులపాలెం : జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు కంకటాల వెంకట రత్నం (నాని) తన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం తన స్వ గృహంలో కుటుంబ సభ్యుల మధ్య కేకు కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి అభిమానుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ఆర్యవైశ్య సభ్యులు కంకటాల వెంకటరత్నం (నాని) భవిష్యత్తులో మరిన్ని పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని, పార్టీలో మరిన్ని పదవులు అధిరోహిం చాలని, ఆర్యవైశ్యులకు మరిన్ని సేవలు చేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ వేడుకల్లో ఆయన ప్రతి ఒక్కరిని ఆప్యాయతగా పలకరించారు. ఈ సందర్భముగా నాని మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్యాకేజి రూపంలో నిధులు మంజూరుకు కృషి చేస్తానని, రైల్వే జోన్‌కు స్పష్టమైన హామీ వస్తుందని, కేంద్రం రాష్ట్రానికి ఎప్పుడూ వెన్ను దన్నుగా ఉంటుందని అన్నారు. అనంతరం రోగులు, వృద్దులకు పాలు, పండ్లు పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లీంలకు డబుల్ బెడ్‌రూం గృహాలు

## ముస్లీం మహిళల కోసం శిక్షణా తరగతులు

### - ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం: ముస్లీంలకు డబుల్ బెడ్‌రూం గృహాలు అందించనున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రకటించారు. గృహాల కోసం దరఖాస్తులు అందచేయాలని కోరారు. విశాఖ దక్షిణం, 23వ వార్డులో సామాజిక భవనంలో ముస్లీం మహిళల కోసం ప్రత్యేక కుట్టు శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధిపై దృష్టిపెట్టాలని కోరారు. మూడు నెలల పాటు జరుగు ఈ శిక్షణా తరగతులనంతరం రూ. 1500 ఉపకార వేతనం, కుట్టుమిషన్లు ఉచితంగా అందచేయడం జరుగుతుందన్నారు. శిక్షణానంతరం ఉపాధి కూడా చూపించడం జరుగుతుందన్నారు. చంద్రన పెళ్లికానుకగా దరఖాస్తు చేసుకుంటే రూ. 50 వేలు అందించడం జరుగుతుందన్నారు. సబ్సిడీ రుణాలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ నర్గీస్, చిన రెహమాన్, ఎఫ్. రెహమాన్ బంగారి రవిశంకర్, నాసిఫ్, హనీఫ్, జఫ్రుల్లా పాల్గొన్నారు.

# అనారోగ్య అమ్మకాలు

## - వారాల వారీ వసూళ్ళు - ప్రేక్షక పాత్రలో పాలకులు

పెద్దాపురం: పట్టణంలో పగలు,రాత్రి అన్న బేధం లేకుండా 24 గంటలు కోడి, మేక మాంసం నిర్విరామంగా అమ్మకాలు జరుగుతున్నాయి. మేకమాంసం అమ్మాలంటే కబేళలో ఆరోగ్యశాఖ అధికారి ముద్ర ఉన్న మేక మాంసం మాత్రమే అమ్మాలి. బ్రాయిలర్ అయితే ఆ నిబంధనలేదు. అమ్మే చోట తూకాలు ఖరీదులు లేవు, మాంసంపై ఆరోగ్యశాఖ ముద్రలేవు. ఉదయం ఎప్పటినుండి ఎప్పటి వరకు మాంసం అమ్మాలో నియంత్రణ లేదు. ఈ మాంసంపై ఈగలు ముసిరినా పట్టించుకొనేనాథుడు లేడు. మాంసాన్ని నీళ్ళతో తడిపి తుయ్యడంతో కేజీకి సుమారు 200 గ్రాముల వరకు తక్కువ వస్తుంది. లైసెన్సులేని దుకాణాలు పట్టణంలో 40 వరకు ఉన్నాయి. ఒక్కో దుకాణానికి వారానికి రూ. 100 చొప్పున 40 దుకాణాలకు నెలకు రూ. 16000లు పెద్దాపురం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కి ముట్టచెప్పాలని దుకాణదారులు వాపోతున్నారు. లేదంటే ఇన్‌స్పెక్టర్ బెదిరింపులతో బయపడుతున్నామన్నారు. నాయకులకు, అధికారులకు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఒక దుకాణదారుని ఆరోగ్యశాఖ ముద్ర కోసం ప్రశ్నిస్తే కస్టమర్‌పై దాడికి ప్రయత్నించగా కమీషనర్ శేషాద్రికి ఫిర్యాదుచేయడం జరిగింది. ఇలాంటివారిపై చర్యతీసుకొని అనారోగ్యకరమైన ఆహారం విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సేవ కార్యక్రమాల నిర్వహించడం ఏపిడబ్ల్యూజెఎఫ్‌కే సాధ్యం

### జిల్లా అధ్యక్షులు అల్లుమల్లు ఏలియా, ప్రధాన కార్యదర్శి షేక్ సలీం



విశాఖపట్నం : జర్నలిస్టు సంక్షేమంతో పాటు సమాజ సేవకు కృషి చేస్తున్న ఘనత ఎపిడబ్ల్యూజేఎఫ్ కు మాత్రమే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అల్లుమల్లు ఏలియా, షేక్ సలీంలు పేర్కొన్నారు. మండపేట నియోజకవర్గ ఎపిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన వివిధ సేవా కార్యక్రమాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మండపేట సంఘం కాలనీలోని అంగన్ వాడీ కేంద్రం వద్ద ఎపిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఎపిడబ్ల్యూజెఎఫ్ మండపేట నియోజకవర్గ అధ్యక్షులు వేమగిరి నూకరాజు, గౌరవాధ్యక్షులు రెడ్డి ఓమేష్ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అల్లుమల్లు ఏలియా, షేక్ సలీంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు మండపేట తహశీల్దార్ చోడిశెట్టి వెంకటలక్ష్మి ప్రత్యేక అతిథిగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సభకు జర్నలిస్టు సతీ సమేతంగా హాజరై గర్భిణీలకు ఘనంగా సీమంతం నిర్వహించారు. అల్లుమల్లు ఏలియా - వరలక్ష్మి, రెడ్డి ఓమేష్ - సీత, వేమగిరి నూకరాజు - రాణి, యన్నన సూర్యప్రకాష్ - సృజన, కోలపల్లి శివాజీ - కుమారిలతో పాటు స్థానిక కాలనీ పెద్దలు వేమగిరి మోషే - లక్ష్మీ దంపతులు కార్యక్రమంలో పాల్గొని మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ చీర, జాకెట్ పళ్ళు, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, స్వీట్లతో 13 మంది గర్భిణీలకు ఘనంగా సీమంతం జరిపించారు. అనంతరం ఎపిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం చేతులు మీదుగా 10 మంది చిన్నారులకు అన్నప్రసాన కార్యక్రమం చేసారు. అలాగే 20 మంది చిన్నారులకు కంచాలు, గ్లాసులు, పలకలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆదర్శ భావాలతో యూనియన్ సభ్యులు ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. జర్నలిస్టు నిర్వహిస్తున్న కార్యక్రమంలో తాను అతిథిగా హాజరై గర్భిణీలకు సీమంతం నిర్వహించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి సలీం మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమం ఒక్కటే కాకుండా తమ యూనియన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ప్రసవానికి ముందు తరువాత మహిళలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలలో సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండపేట నియోజకవర్గ అధ్యక్షులు వేమగిరి నూకరాజు మాట్లాడుతూ కేంద్రాల నుండి ఆహార పదార్థాలను గర్భిణీలు ఇంటికి తీసుకువెళ్ళడం మంచిది కాదన్నారు. దీనివల్ల పౌష్టికాహారాన్ని సంపూర్ణంగా తీసుకునే అవకాశం ఉండదన్నారు. పిల్లలకో ఇంట్లో వారికో షేర్ చేయడం వలన పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందదన్నారు. కేంద్రం వద్దే వండిన ఆహార పద్దారాలను తీసుకోవాలని సూచించారు. అంగన్ వాడీ టీచర్లు సైతం ఇంటికి పట్టుకువెళ్ళనీయకుండా కేంద్రం వద్దే తినేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షులు ఏలియా మాట్లాడుతూ జర్నలిస్టుకు ఏ సమస్య వచ్చినా ఎపిడబ్ల్యూజేఎఫ్ అందరికంటే ముందుండి ఆదుకుంటుందన్నారు. వీటితో పాటు మండపేట లోని నూతన కార్యవర్గం సేవా కార్యక్రమాలతో దూసుకుపోవడం అభినందనీయమన్నారు. ఇటీవల ఇద్దరు పేద విద్యార్థులకు స్కాలర్షిప్లు పంపిణీ చేసిన యూనియన్ సభ్యులు గర్భిణీలకు పెద్ద ఎత్తున సీమంతం నిర్వహించడం ప్రశంసనీయమని కొనియాడారు. స్థానిక పెద్ద వేమగిరి మోషే మాట్లాస్తుతూ జర్నలిస్టులు తమ కార్యక్రమానికి పిలవడమే తెలుసు గాని వారు చేసే కార్యక్రమాలకు తాము రావడం కొత్త సంస్కృతి కి శ్రీకారం చుట్టినట్లు ఉందన్నారు. అంగన్ వాడీ టీచర్ తాతవోలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ తమ ఐ.సి.డి.ఎస్. పరిధిలో ఇంతకు ముందెప్పుడు ఇంత ఘనంగా ఎవ్వరూ సీమంతం నిర్వహించలేదన్నారు. సొంత అక్కా చెల్లెళ్ళకు నిర్వహించినట్లు సీమంతం జరిపిన జర్నలిస్ట్ సోదరులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యతగా బోడపాటి ప్రసాద్ వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజేఎఫ్ నాయకులు సూర్య శ్రీనివాస్, ప్రజాశక్తి సుబ్బరాజు, సీవీఆర్ సుధీర్, వార్త సతీష్ శ్రీనివాసరెడ్డి, కోట సతీష్, పెదపూడి పండు, గుడ్ల రవీంద్ర, గ్రంధి సత్తిరాజు, అంగనవాడీ టీచర్లు చిత్తరపు రాణి, ఎస్.దేవకీ దేవి, సింగం దుర్గ, రెడ్డి రమణ, పి. రామలక్ష్మి, సిహెచ్ కమల, వై.దుర్గా భవానీ, వి. రాధా రుక్మిణి, జె సత్యకుమారి, వి. సింహాచలం, వి. శారదా లక్ష్మి, ఆయాలు డి. పార్వతి, వరలక్ష్మి, శ్రీ సుధా కన్సల్టెన్సీ అధినేత డేగల లక్ష్మణరావు, స్థానిక పెద్దలు, గ్యాస్ త్రిమూర్తులు, కోనే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్‌ను కలిసిన చేనేత కార్మికులు



తూర్పుగోదావరి : అలుపెరుగని మోముతో రాష్ట్ర ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసం కల్పయాత్ర తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో విజయవంతంగా కోనసాగుతోంది.

టీడీపీ అధికారంలో ప్రజలకు అడుగడుగునా ఎదురవుతున్న కష్టాలను తెలుసుకుంటూ వారికి భరోసా ఇస్తూ రాజన్న తనయుడు ముందుకు కదులుతున్నారు.

తాజాగా జననేతను చేనేత కార్మికులు కలిసి వారి సమస్యలను విన్నవించుకున్నారు. చంద్ర బాబు చెప్పుకుంటున్న చేనేత రుణమాఫీ ఎవరికి అందిందో తెలీదని వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. వయసు పైబడిని చేనేత కార్మికులకు మూడు వేల పింఛన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికుల కష్టాలు విన్న రాజన్న తనయుడు.. అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు తీర్చుతానని హామీఇచ్చి ముందుకు సాగారు.

# కొత్త పోలీసు కమిషనర్‌ను కలిసిన వైజాగ్ ఛాంబర్ అధ్యక్షుడు



వైజాగ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (వీసీసీఐ) కార్యాలయ అధ్యక్షులు డి.వి రాజు, మోనిష్ రౌ, వైభవ్ సతీష్ మరియు పిఎల్‌కె మూర్తి, తదితరులు కొత్తగా పదవీబాధ్యతలు చేపట్టిన పోలీసు కమిషనర్ శ్రీ మహేష్ చంద్ర లడ్డాను కలిశారు. వారు తమ కార్యాలయ కార్యకలాపాలను గూర్చి కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా వారు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించామని కమిషనర్‌కు విన్నవించుకున్నారు.

## మంత్రి అయ్యన్న సమక్షంలో టీడీపీలో చేరిన వైసిపి నాయకులు

నర్సీపట్నం : రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి అయ్యన్నపాత్రుడు సమక్షంలో బుధవారం గొలుగొండ మండలం గుండుపాల, కొత్తూరు గ్రామ పంచాయతీకి చెందిన 120 మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి టీడీపీ పార్టీలోకి చేరారు. మంత్రి అయ్యన్నకండువా కప్పి టీడీపీ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి అయ్యన్న మాట్లాడుతూ టీడీపీ సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి తనయుడు చింతకాయల రాజేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు, సర్పంచ్ రాధిక, ఎంపిటిసి రవివర్మ, ప్రభాకర్, గోపి, ధనాజీ, పల్లా సత్తిబాబు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ఉద్యోగం కత్తి మీద సాము వంటిది

### ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.శ్రీకళ

నర్సీపట్నం : ఐసిడిఎస్ ఉద్యోగం కత్తి మీద సాము వంటిదని, పదవీ విరమణ పొందటం ఎంతో అదృష్టమని నర్సీపట్నం ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.శ్రీకళ పేర్కొన్నారు. బుధవారం ప్రాజెక్టులోని గబ్బాడ సెక్టార్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ జగదీశ్వరి పదవీ విరమణ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు కుటుంబ సభ్యులు మధ్య ఘనంగా పదవీ విరమణ శుభాకాంక్షలను తెలియజేశారు. ప్రస్తుత ఆన్‌లైన్ వర్కు ఇతర రిపోర్టులు ఎప్పటికప్పుడు అందించే ప్రక్రియలో సూపర్‌వైజర్ తనదైన శైలిలో ఎప్పుడు వందశాతం ఆన్‌లైన్‌లో రిపోర్టులు అందుబాటులో ఉంచేవారన్నారు. అందరితోను సక్రమంగా మెలగడం, అప్యాయతగా ప్రవర్తించడంతో పాటు పై అధికారులకు లోబడి ఉండటం ఆమెకు వెన్నతో పెట్టిన విద్యగా పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఆమె నడవడికన ఆదర్శంగా తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపిఒ రమణి, సూపర్‌వైజర్లు ఐ.సత్యవతి, రమణమ్మ, చంద్రమ్మ, విజయలక్ష్మి, విజయకుమారి, సత్యవతి, కార్యాలయ యుడిసి దొర, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# భారత క్రికెటర్లను ఆహ్వానించిన ఇమ్రాన్






ఇస్లామాబాద్ : రాజకీయాల్లోకి అడుగుపెట్టినా క్రికెట్ అనే పదాన్ని ఇమ్రాన్ ఖాన్ నుంచి వేరు చేయలేం అనిపిస్తోంది. ఎందుకంటే వన్డే ప్రపంచ కప్ అందించి దేశ ప్రజల కలను సాకారం చేసిన వ్యక్తి ఇమ్రాన్. పాకిస్తాన్ నూతన ప్రధానిగా తన ప్రమాణ స్వీకారోత్సవానికి సార్క్ దేశాల అధినేతలతో పాటు భారత ప్రధాని నరేంద్ర మోదీని పాకిస్తాన్ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ అధినేత, పాక్ మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఆహ్వానించిన విషయం విదితమే. ఆ వేడుకలో ఆహ్వానితుల జాబితాలో భారత క్రికెటర్లకు ఇమ్రాన్ స్థానం కల్పించి క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారు.

తాను క్రికెట్ ఆడే సమయంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, నవజ్యోత్ సింగ్ సిద్ధూలను ఆగస్టు 11న ప్రధానిగా తన ప్రమాణ స్వీకార వేడుకకు ఇమ్రాన్ ఖాన్ ఆహ్వానించారు. వీరితో పాటు బాలీవుడ్ మిస్టర్ ఫర్ఫెక్షనిస్ట్, ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్‌కు ఆహ్వానం అందించారు. పాక్ విదేశాంగశాఖ అధికారులతో చర్చించిన అనంతరం వీరికి ఇన్విటేషన్ పంపినట్లు పీటీఐ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం అనంతరం 2014 మేలో భారత ప్రధానిగా నరేంద్ర మోదీ ఏ తరహాలో ప్రమాణ స్వీకారం చేశారో.. నేడు అదే తీరును ఇమ్రాన్ ఖాన్ ఫాలో అవుతున్నారు. సార్క్ దేశాల అధినేతలతో పాటు అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను సైతం మోదీ ఆహ్వానించి ద్వైపాక్షిక సంబంధాలకు శ్రీకారం చుట్టారు. కాగా, నేడు ఇమ్రాన్ సైతం సార్క్ దేశాల అధినేతలతో పాటు ప్రధాని మోదీని, భారత దిగ్గజ క్రికెటర్లకు ఆహ్వానితుల జాబితాలో చోటు కల్పించారు.

# కావాలంటే అరెస్ట్ చెయ్యండి

### కోల్‌కతాకు వచ్చి తీరతాను: అమిత్ షా



ఢిల్లీ: పశ్చిమ్‌బంగా ప్రభుత్వం కావాలనుకుంటే తనను అరెస్ట్ చెయ్యొచ్చని, కానీ తాను తప్పకుండా కోల్‌కతాకు వస్తానని భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా సవాల్ విసిరారు. కోల్‌కతాలో భాజపా యువ మోర్చా అమిత్ షా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ప్రణాళిక వేసింది. కానీ పోలీసులు అందుకు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో అమిత్ షా స్పందించారు. అనుమతి ఇచ్చారా లేదా అన్నది విషయం కాదని, తాను తప్పకుండా కోల్‌కతా వస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కావాలంటే తనను అరెస్ట్ చేసుకోవచ్చని అన్నారు. భాజపా యువ మోర్చా ఆగస్టు 11న కోల్‌కతాలో ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించింది.

ఈ ర్యాలీకి అమిత్‌షా హాజరుకావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు అనుమతి విషయంపై పోలీసుల నుంచి ఎలాంటి సమాచారం అందలేదని యువ మోర్చా అధ్యక్షుడు దేవ్‌జిత్ సర్కార్ ఈరోజు ఉదయం వెల్లడించారు. అమిత్ షా ర్యాలీకి అనుమతి కోరుతూ పోలీసులకు దరఖాస్తు ఇచ్చామని చెప్పారు.

# నేడు కశింకోట రాజమౌళి రాక

అనకాపల్లి..... నేడు ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళి కశింకోట రాక 160 సంవత్సరాలు చరిత్ర గలిగిన ధూరిశెట్టి పెదనర్సింగరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1857లో ఏర్పాటైంది. కాని ప్రారంభం నుండి, సరైన వసతులు లేకుండా సంవత్సరాలు గడిచిపోయాయి. 2014లో వచ్చిన హుదూత్ తుఫాన్ దెబ్బకు పాఠశాల కోల్పోయి పాఠాలు చెట్లు నీడకు పరిమితమయ్యాయి. తమ బంధువులు ద్వారా విషయం తెలుసుకున్న రాజమౌళి, 40 లక్షల రూపాయలతో తన మాతృమూర్తి దివంగత జనని రాజనంధినీ పేరుతో నిర్మించడానికి 2015లో శ్రీకారం చుట్టారు.

కాకినాడలో ఉన్న ఆయన బంధువుల ద్వారా, నాలుగు గదులు, చొప్పున రెండు అంతస్తులుగా వీటిని నిర్మించారు. ఈ తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఈభవనాన్ని నేడు ప్రారంభించడానికి రాజమౌళి కశింకోట వస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఎమ్మెల్యే పీలా, ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ శర్మ తదితరులు విచ్చేస్తున్నారు.

## గింజర్తిలో ఇంటింటికీ జ్వరాలు

గొలుగొండ : గొలుగొండ మండలం గింజర్తి గ్రామంలో వారం రోజులుగా ప్రజలు వైరల్ తదితర జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో ప్రభుత్వం వైద్య శిబిరం ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వైద్య సేవలు పొందుతున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వైద్య సిబ్బంది సరిగ్గా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం గ్రామంలో ఇంటికొకరు చొప్పున వైరల్ జ్వరాలు, దగ్గు, మోకాళ్ల నొప్పులు తదితర వ్యాధులతో కొట్టుమిట్లాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికార్లు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు,

గ్రామ మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ కోరారు.

# పాఠశాల విద్యార్థుల సహాయార్ధం ఆగస్టు 3 నుంచి వస్త్ర ప్రదర్శన మేళా




విశాఖపట్నం : సమాజ సేవలో భాగంగా అఖిల భారతీయ మహిళా సమ్మేళన్ ఆధ్వర్యంలో నగరంలో ఆగస్టు 3 నుంచి వస్త్ర, వస్తు ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు అఖిల భారతీయ మహిళా సమితి అధ్యక్షురాలు ఉష గుప్త తెలిపారు. బుధవారం నగరంలో సంస్థ కాంప్ కార్యాలయం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల ( ఆగస్టు ) 3, 4 తేదీల్లో నగరం లోని సాగర తీరం లో గల పామ్ బీచ్ హెూటల్ లో అఖి భారతీయ మహిళా సమ్మేళన్ సభ్యులు నేతృత్వంలో అత్యంత ఆకర్షణీమైన వస్త్ర, వస్తు ప్రదర్శనను నిర్వహిస్తున్నారు తెలిపారు. యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ఆడారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ వ్యాపార నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి విశాఖ ప్రాంతానికి వచ్చిన వీరంతా ప్రతి ఏటా ఒక మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అవసరమైన విద్యా సంస్థలకు తమ వంతు సహకారాన్ని అందించడం అభినందనీయమన్నారు. తమ సంఘం లో 50 మంది సభ్యులున్నారని, గత పది సంవత్సరాలుగా తమ సంస్థ పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వీటిలో భాగం గానే జరుగుతున్న ప్రతి ఏటా ఈ వస్తు వస్త్ర ప్రదర్శనలు నిర్వహించి, తద్వారా వీటిల్లో వచ్చిన ఆదాయం ను సమాజ అభివ ృద్ధి భాద్యతా కార్యక్రమాలకు వినియోగిస్తూ పలు విద్యా సంస్థలు, శరణాలయాలు, ఆశ్రమాలకు అవసరమయ్యే సామాగ్రి, పరికరాలను అందిస్తున్నట్టు తెలిపారు. గత ఏడాది 2017 జులై 12 ,13 తేదీల్లో నిర్వహించిన ది ఫెయిర్ వస్తు ప్రదర్శనలో వచ్చిన ఆదాయాన్ని విశాఖ - భీమిలి బీచ్ మార్గంలో చిన్న జీయర్ స్వామి - జీయర్ ఎడ్యుకేషనల్ సంస్థ ఆధ్వర్యవంలోని నడుపబడుతున్న నేత్ర విద్యాలయకు రెండు ప్రింటర్లు, 50 జతల పాదరక్షలు, ఇతర సామాగ్రి అందించగలిగా మన్నారు. గోపాలపట్నం లోని మునిసిపల్ పాఠశాలలో మంచి నీటి ప్యూరిఫైయర్ ఏర్పాటు చేశామని, దివ్యంగుల పాఠశాలకు రూ. 21 వేలు అందించామని, స్నేహ సంధ్య సంస్థ ద్వారా కాన్సర్ వ్యాధిగ్రస్తులకు రూ. 51 వేలు అందించామని, సృజనావాణి స్వచ్ఛంద సంస్థ ద్వారా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు వెళు న్న శిక్షణ నిమిత్తం 40 వేల రూపాయలు అందించామని తెలిపారు.

దీనిలో భాగంగానే ఈ పర్యాయం 2018 విశాఖ జిల్లా లోని జి. మాడుగుల లో ఆరోహణ్ పేరిట ట్రైబల్ బృందం నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యవంలో గొప్పులపాలెం, కొత్తపల్లి ట్రైబల్ ( ఏజెన్సీ ) గ్రామాల్లో బాత్రూం ల నిర్మాణానికి ఆర్థిక సహాయం తో పాటు ఎస్. కోట మండలం లోని సోంపురం గ్రామంలోని పాఠశాలలోని విద్యార్థులకు మంచినీటి అవసరాల కోసం 500 లీటర్ల పరిణామం కల్గిన మంచి నీటి ట్యాంకులను రెండింటిని అందిస్తున్నట్టు వివరించారు. ఈ ఏడాది జరిగే వస్తు ప్రదర్శన మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాకు చెందిన ఫ్యాషన్ డిజ్కైనర్లు, ఇంటీరియర్ డెకరేటర్స్, హెూమ్ డెకరేటర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఉత్పత్తును ఈ ప్రదర్శనల్లో విక్రయానికి అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. సుమారు 25 కు పైగా స్టాల్స్ ద్వారా వందలాదిగా మేటి ఉత్పత్తును ప్రజల కు అందుబాటులో ఉంచుతారని, వాటి ల్లో ప్రధానంగా డిజ్కైనర్ చీరలు, రెడీమే డ్ డ్రెస్లు, డ్రెస్ మెటీరియల్, జర్దొసీ ఉత్పత్తులు, వివిధ తరహా రాఖీలు, ఆధునిక ఆభరణాలు, గిఫ్ట్ ఉత్పత్తులు, ట్రౌజవ్ పాకింగ్, డిజ్కైనర్ బెడ్ షీట్లు, డిజ్కైనింగ్ న్కెటీలు, ఇంటి అలంకరణ ఉత్పత్తులు, యువతీ యువకుల అవసరాలకు అను గుణంగా అత్యాధుని క మోడళ్ళలో వివిధ ఉత్పత్తులను ఈ ప్రదర్శనల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

సంస్థ కార్యదర్శి సునీతా అగర్వాల్ , కోశాధికారి ఉమా డాగా మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఆగస్టు 3 ,4, 2018 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ప్రదర్శన ఉంటుందని, నగర వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన వలసిందిగా ఆహ్వానిస్తున్నారు. ఈ ప్రదర్శన లో ప్రదర్శకులకు, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం జరుగుతుందని వివరించారు.

# తల్లి పాల సంస్కృతిని అందరూ ప్రోత్సహించాలి

గీతం జిమ్‌సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్



సాగర్‌నగర్ : ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లి పాలు అత్యంత ఉపయోగకరంగా నిలుస్తాయని ఈ దృష్ట్యా తల్లి పాల సంస్కృతిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని గీతం విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా గీతం నర్సింగ్ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వవలసి ఉండగా దేశంలో కేవలం 55 శాతం మంది పిల్లలకు మాత్రమే తల్లిపాలు దక్కుతున్నాయని వివిధ సర్వేల్లో వెల్లడైందన్నారు.బిడ్డ పుట్టిన తరువాత తల్లి నుంచి మూడు రోజుల పాటు అందే తల్లి పాలు చిక్కగా పోషక పదార్ధాలతో ఉంటాయని వీటిని అందించటం తప్పనిసరి అని అన్నారు. తల్లి పాల వల్ల రోగ నిరోధక శక్తి పెరగటంతో పాటు జీర్ణాశయ సంబంధ సమస్యలు తక్కువగా ఉంటాయని వెల్లడించారు. ఉద్యోగం చేసేవారు సైతం తల్లి పాల సంస్క ృతిని విడనాడకుండా కొనసాగించాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో నర్సింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.కనకలక్ష్మీ పలువురు సీనియర్ ప్రొఫెసర్లు, నర్సింగ్ విద్యార్ధినులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయి

నవయుగ ప్రాంగణంలో 100 మొక్కలు నాటే కార్యక్రమం



విశాఖ సిటీః పర్యావరణ పరిరక్షణకు పచ్చని చెట్లు, మొక్కలే దోహదపడతాయని డిఆర్‌డిఓ అడిషనల్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ దేవగిరి పేర్కొన్నారు. బుధవారం నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చింతా శ్రీధర్ 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నవయుగ ప్రాజెక్ట్ సైట్ ఆఫీస్‌లో డైరెక్టర్ ఎన్‌ఎస్‌ఎన్ బాబు ఆధ్వర్యంలో 100 మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో మల్కాపురం లా అండ్ ఆర్డర్ సిఐ కేశవ, ట్రాఫిక్ సిఐ భాస్కరరావు, డిఆర్‌డిఓ అడిషనల్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ దేవగిరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ విశాఖ మహానగరంలో రోజు రోజుకూ కాలుష్యం పెరిగిపోతోందని, కాలుష్య నియంత్రణకు పచ్చని మొక్కలు పెంచవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. పుట్టిన రోజు నాడు ఆటపాటలకు తావివ్వకుండా సమాజ హితమైన మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం నవయుగ ఇంజనీరింగ్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నవయుగ మేనేజింగ్ డైరెక్టర్ చింతా శ్రీధర్ మాట్లాడుతూ కేవలం వ్యాపార దృక్పథం కాకుండా సమాజ శ్రేయస్సుకు వనం-మనంలో మేము కూడా భాగస్వాములైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డిజిఎం నారాయణ రావు, ప్రాజెక్టు మేనేజర్ ఉదయ భాస్కర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విశాఖ యంపి కంభంపాటి హరిబాబు నేతృత్వంలో భారత ఉప రాష్ట్రపతి యమ్.వెంకయ్యనాయుడు స్వగృహంలో విశాఖ బిజెపి నాయకులు మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ బిజెపి అధ్యక్షుడు యమ్.నాగేంద్ర, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ప్రకాశరెడ్డి, పివి నారాయణ రావు, నరేంద్ర ప్రకాష్, జీసి నాయుడు ,మల్ల వెంకట్రావు, పులుసు జనార్ధన్, గంటా వెంకట్రావు, అప్పలకొండ యాదవ్, కేశవ కాంత్, పరశురామ రాజు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల విషయంలో
# నాటకాలాడింది మీరే

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



వైఎస్సార్ జిల్లా : కాపు రిజర్వేషన్ల విషయంలో నాటకాలు ఆడింది చంద్రబాబేనని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో రిజర్వేషన్ల అంశాన్ని చేర్చి ఓట్లు దండుకున్న చంద్రబాబు.. ప్రస్తుతం ఎల్లో మీడియాలో డిబేట్లు నిర్వహించి ప్రతిపక్షంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాపులకు రిజర్వేషన్లు వస్తున్నాయి. పండుగ చేసుకోండంటూ ప్రచారం చేసుకుంది చంద్రబాబు కాదా అని శ్రీకాంత్ రెడ్డి ప్రశ్నించారు. ఎకిల నాయుడులను, మైనార్టీలను బీసీల్లో చేర్చిన మహానేత వైఎస్సార్ ఎప్పుడూ కూడా ప్రచారం చేసు కోలేదన్నారు. చంద్రబాబు మాత్రం.. ప్రకటనల కోసం కోట్లు ఖర్చు పెడుతూ, ప్రజా ధనాన్ని వృధా చేస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బాబు నాటకాలన్నీ ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

# కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

## రాష్ట్రపతికి మెమొరాండం సమర్పించిన ఎంపీలు



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో త్వరితగతిని స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ ఎంపీలు కోరారు. ఈ మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను వీరు బుధవారంనాడు కలిసి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. కేంద్ర మాజీ పౌరవిమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు సారథ్యంలోని టీడీపీ ప్రతినిధి బృందం రాష్ట్రపతి భవన్‌లో రామ్‌నాథ్ కోవింద్‌ను కలుసుకున్నారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్రపతిని కలిసినట్టు రాష్ట్రపతి కార్యాలయం ఓ ట్వీట్‌లో పేర్కొంది.

కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశంపైం ఏపీ ప్రభుత్వం, కేంద్రం కొద్ది నెలలుగా సిగపట్లు పట్టుకుంటున్నాయి. 2014 ఏపీ రికగ్నైజేషన్ చట్టం (తెలంగాణ యాక్ట్)లో హామీ ఇచ్చిన విధంగా స్టీల్ ప్లాంట్ కడపలో ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం డిమాండ్ చేస్తుండగా, ఆ ప్రతిపాదనను కేంద్రం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తోసిపుచ్చింది. ఈ ప్రాజెక్టు ఆర్థికంగా ఏమాత్రం కలిసిరాదని కేంద్రం పేర్కొంటూ ఈ నిర్ణయాన్ని ఇటీవల ఉపసంహరించుకుంది. అయితే కేంద్రం వాదనను ఏపీ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. కనీసం 15 ఏళ్లయినా వెనక్కి తిరిగిచూసుకోవాల్సిన అవసరం లేని ప్రాజెక్టు ఇదని కుండబద్దలు కొట్టింది. కడపలో ఇండిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ టీడీపీ ఎంపి సి.ఎం.రమేష్ కడపలో ఇటీవల 10 రోజుల పాటు నిరాహార దీక్ష కూడా చేశారు.

# ఘనంగా చొక్కాకుల గోవింద జన్మదినోత్సవ వేడుకలు





ప్రముఖ వ్యాపారవేత్త, వైఎస్సార్ సీపీ నాయకులు, సబ్బవరం మండలం అంతకాపల్లి గ్రామ సర్పంచ్ చొక్కాకుల గోవింద జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు అభిమానులు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజక వర్గ సీనియర్ నాయకుడు, సంఘ సేవకుడు చొక్కాకుల వెంకటరావు, రొంగలి బుచ్చం నాయుడు, మేడపురెడ్డి జగన్నాథం, గొంపా దేముడు బాబు, దాసరి నాయుడు, రమణ, 37వ వార్డు వైకాపా నాయకుడు కోరుబిల్లి విజయ్‌లతో పాటు చొక్కాకుల ఛారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ చొక్కాకుల రామకృష్ణ, తర్రా సతీష్ తదితరులు ఉన్నారు.

# కేంద్రం అఫిడవిట్లపై నోరుమెదపరేం?

పవన్, జగన్‌ను ప్రశ్నించిన యనమల


అమరావతి: సుప్రీంకోర్టులో కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్లపై జగన్, పవన్ ఎందుకు నోరు మెదపడం లేదని ఆర్థిక మంత్రి యనమల ప్రశ్నించారు. మోదీ ఏమాయ చేశారో వారిద్దరూ చెప్పాలని కోరారు. పారిశ్రామిక రాయితీలు, పన్ను ప్రోత్సాహకాల గురించి కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదని, మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలపై ఎందుకు మాట్లాడరని మంత్రి ప్రశ్నించారు. నోట్ల రద్దు, జీఎస్టీ దుష్ఫలితాలు వీరిద్దరికీ కనపడడం లేదా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి దృష్టంతా ముఖ్యమంత్రి పీఠంపైనే ఉందని ఎద్దేవాచేశారు. గతంలో రైతు రుణమాఫీలో విషయంలో, ఇప్పుడు కాపు రిజర్వేషన్ల విషయంలో జగన్‌కు మాటపై నిలకడ లేదని వ్యాఖ్యానించారు. జగన్‌కు దేనిపైనా అవగాహన లేదని యనమల ధ్వజమత్తారు.





LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750





VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com